ప్రజాశక్తి

గురువారం 17 జులై 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

కౌలురైతులకు మొండిచేయి

రుణాల మంజూరుపై బ్యాంకర్ల మీనమేషాలు - అసంపూర్తిగా సిసిఆర్‌సి కార్డుల జారీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కౌలు రైతులకు సాయం అందించే విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 46,670 మందికి సిసిఆర్‌సి (కౌలు గుర్తింపు) కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా 38,972 మందికి కార్డులు జారీ చేశారు. వీరిలో 1362 మందికి సంబంధించిన గ్రూపులకు కేవలం రూ.19.09 కోట్లే రుణాలు అందించారు. మొత్తంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 534 జాయింట్ లయబులిటి గ్రూపులకు చెందిన 5217 మంది కౌలు రైతులకు రూ.20.48 కోట్ల రుణాలిచ్చారు. 216 రైతు మిత్ర గ్రూపులకు చెందిన 2930 మంది రైతులకు రూ.20.30 కోట్లు రుణాలుగా ఇచ్చారు. మొత్తంగా అన్ని కేటగిరీల్లో కలిపి 9509 మంది రైతులకు రూ.59.87 కోట్ల రుణాలిచ్చారు. మొత్తం రుణ ప్రణాళికలో కేవలం రెండు శాతం సొమ్మును

మాత్రమే కౌలు రైతులకు కేటాయించారు.

జిల్లా రుణ ప్రణాళికలో పంట రుణాలు రూ.5050 కోట్ల మేరకు లక్షంగా నిర్దేశించగా కనీసం 10 శాతం కౌలు రైతులకు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ప్రతి ఏటా కౌలు రైతులకు 10 శాతం రుణాలు ఇవ్వాలని లక్షంగా నిర్ధేశించినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో కేవలం ఒక్క శాతం అంటే రూ.50 కోట్లు కాగా రూ.59.87 శాతం రుణాలు ఇవ్వడం ద్వారా ఒక్కశాతానికి మించి రెండు శాతం కంటే తక్కువగా రుణాలు ఇచ్చినట్టు వ్యవసాయ శాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటిల్లో కూడా కొన్ని నియోజకవర్గాల్లో అతి తక్కువ మంది కౌలు రైతులకు రుణాలిచ్చారు. స్వతంత్రంగా రుణాలు పొందిన కౌలు రైతుల్లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో 10,018 మందికి సిసిఆర్‌సి కార్డులు ఇవ్వగా 470 మందికి రూ.5.47 కోట్లు, మంగళగిరి నియోజకవర్గంలో 6175 మందికి సిసిఆర్‌సి ఇవ్వగా వీరిలో 374 మందికి రూ.5.28 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 7049 మందికి సిసిఆర్‌సి ఇవ్వగా కేవలం 78 మందికి రూ.1.38 కోట్లు రుణాలుగా ఇచ్చారు. తెనాలిలో 6372 మంది సిసిఆర్‌సి పొందగా కేవలం 54 మంది రైతులకు రూ.1.44 కోట్లు రుణాలుగా ఇచ్చారు. పొన్నూరు నియోజకవర్గంలో 9358 మంది సిసిఆర్‌సి కేవలం 386 మందికి రూ.5.52 కోట్లు రుణాలుగా ఇచ్చారు.

ఈ ఏడాది జిల్లాలో 46,400 మంది కౌలు రైతులకు సిసిఆర్‌సి ▶ 2లో

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి

విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

దశలవారీ ఉద్యమానికి వామపక్షాలు, ప్రజాసంఘాలు పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోకుంటే మరో బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమం తప్పదని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు హెచ్చరించాయి. విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈనెల, వచ్చే నెలలో దశల వారీ ఆందోళనలకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సిపిఐ (ఎంఎల్) జిల్లా నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. సిఐటియు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, ఎ.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ ఈనెల 17-22 వరకూ మండల, పట్టణ స్థాయి సదస్సులు, 23-29 వరకూ ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, జులై 30-ఆగస్టు 4 వరకూ కాలనీ సమావేశాలు, నిరసన కార్యక్రమాలు, ఆగస్టు 5న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 7న జిల్లాలో ప్రత్యేక నిరసనలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు.

ఈ సందర్భంగా వామపక్ష ▶ 2లో

గుంటూరు శిబిరం వద్ద వంటావార్పు

ఉధృతంగా ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

గుంటూరులోని హెడ్ వాటర్ వర్క్స్ వద్ద వంటావార్పు - నాలుగో రోజుకు ఆందోళనలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె ఉధృతం అవుతోంది. గుంటూరు పల్నాడు జిల్లాల్లో సమ్మె బుధవారంతో 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరులోని తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో వర్కర్లు వంటావార్పు ద్వారా నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని అనేక ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఎపికెఎస్) జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫి) రాష్ట్ర నాయకులు ఎం.సాంబశివరావు, ఒబిసి బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రాము, ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఎపిఎంఎస్ఆర్.యు) రాష్ట్ర నాయకులు షేక్ అబ్దుల్ సలీం, ఫణీంద్ర, జన్నత్ హుస్సేన్, 108 అంబులెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబు, అపార్ట్మెంట్ వాచ్మెన్స్ అండ్ మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆది నికల్సన్ తదితరులు మద్దతు తెలిపారు. ప్రజలకు ప్రాణాధారమైన నీటిని అందజేస్తున్న కార్మికులకు వేతనం ఎంత ఇచ్చినా తక్కువేనని, కానీ ప్రభుత్వం కనీస వేతనాలు కూడా ఇవ్వట్లేదని అన్నారు. ఆరేడేళ్లుగా వేతనాలు పెంచకపోతే కార్మికుల కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను శ్రమ దోపిడీ చేస్తోందని విమర్శించారు. ▶ 2లో

నరసరావుపేటలో మాట్లాడుతున్న గోపాలరావు

క్రోసూరులో సైకోకు అరదండాలు

ప్రజాశక్తి - క్రోసూరు

కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే తన కొడుకుని హత్య చేశాడు. గతంలో మూగ చెల్లిని, తల్లితండ్రులను, ఆరు నెలల పసికందుని హతమార్చిన దుండగుడు తాజాగా కొడుకునీ చంపడంతో క్రోసూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అచ్చంపేట మండలం పుట్లగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు నాయక్ కొడుకును హత్య చేసి పొలంలో పాతిపెట్టి ▶ 2లో

నిందితుణ్ణి తహాశీల్దార్ కార్యాలయంలో హాజరు పరుస్తున్న విఆర్ఓలు

నేటి నుండి తాగునీటి సరఫరా యథాతథం

నగర ఇన్‌చార్జి కమిషనర్ ఓబులేసు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో గురువారం ఉదయం నుండి యధావిధిగా తాగునీటి సరఫరా జరుగుతుందని జీఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరానికి తాగునీటి సరఫరా జరిగే మేజర్ పంపింగ్ కేంద్రమైన ఉండవల్లి నుండి వచ్చే మార్గంలో నులకపేట దగ్గర పడిన గండి వలన, అలాగే పంపింగ్ కేంద్రాల్లోని అప్కాస్ కార్మికుల సమ్మె వలన నగరంలో గత రెండ్రోజులుగా తాగునీటి సరఫరాలో సమస్యలు ఏర్పడ్డాయని చెప్పారు. జీఎంసి కాల్ సెంటర్, స్థానిక రిజర్వాయర్ల పరిధిలో ప్రజల అవసరాల మేరకు ట్యాంకర్ల ద్వారా త్రాగునీటి సరఫరా చేశామన్నారు. నులకపేట వద్ద గండిని పూర్తి స్థాయిలో పూడ్చి వేయడం జరిగిందని, సమ్మెలో ఉన్న వారిలో 27 మంది బుధవారం నుండి విధుల్లో చేరారన్నారు. బుధవారం మధ్యాహ్నం నుండి యధావిధిగా అనగా ఉండవల్లి, సంగం జాగర్లమూడి నుండి నీటిని పంపింగ్ చేస్తున్నామన్నారు. బుధవారం సాయంత్రం పాక్షికంగా, గురువారం ఉదయం నుండి యధావిదిగా నగరంలో సరఫరా జరుగుతుందన్నారు. అప్కాస్ కార్మికుల సమస్యల పరిష్కారంకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున ప్రజలకు అత్యవసరమైన తాగునీటి సరఫరాని ఇబ్బందికి గురి చేయకుండా సమ్మె విరమించి కార్మికులు విధుల్లో చేరాలని కోరారు.

25వ తేదీ వరకూ బంగారు కుటుంబాల సర్వే

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

బంగారు కుటుంబాల అవసరాల ప్రాతిపదిక ప్రాథమిక సర్వే కార్యక్రమం ఈనెల 15 నుండి 25వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్‌లో పబ్లిక్, ప్రైవేట్ , పీపుల్ భాగస్వామ్యంతో చేపడుతున్న పి4 కార్యక్రమం అమలుపై రెవెన్యూ డివిజన్ అధికారులు, నియోజకవర్గం ప్రత్యేక అధికారులు , యంపీడీఓ లు, తహశీల్దార్లు , మున్సిపల్ అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 7 నుండి 10వ తేదీ వరకూ బంగారు కుటుంబాల అదనపు మార్పులకు, చేర్పేలకు అవకాశం కల్పిస్తామన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడిన బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావాలన్నారు. బంగారు కుటుంబాల ఆర్థిక అభివద్ధికి మార్గదర్శీలు బాటలు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఆర్థిక సహాయ సహకారాలు అందించడమే గాకుండా, సంక్షేమ పథకాలు వారికి వర్తింప చేయాలన్నారు. ఆ కుటుంబాలలోని యువత నైపుణ్యాల అభివద్ధి, జీవనోపాధి బాధ్యత మార్గదర్శీలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగమేళాలు, కెరియర్ గైడెన్స్ ఇచ్చేలా మార్గ నిర్దేశం చేయాలన్నారు. బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగినట్లు నిర్ధరించడానికి 523 అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. నాణ్యమైన సేవలు అందించలేని మార్గదర్శీలను తొలగించాలన్నారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శీల అనుసంధాన ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు అందుబాటులో ఉన్న వనరులు, సద్వినియోగం చేసుకునే అంశాలపై పూర్తిస్థాయిలో చైతన్యం తీసుకురావాలన్నారు. సమాజంలో అత్యధిక ధనికులుగా ఉన్నవారు అందించే ఆర్థిక సహాయం పరిమితి అధికంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పి4 విధానం రాష్ట్ర కమిటీ సభ్యులు సంతోష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించడం, వనరులను సమకూర్చే ప్రక్రియ వేగంగా చేయాలన్నారు. సమావేశంలో జీయంసీ కమిషనర్ (ఇన్ ఛార్జీ) ఓబులేశు , జెడ్పీ సిఇఓ జ్యోతిబసు , సిపిఓ శేషశ్రీ , డిపిఓ నాగ సాయి కుమార్, నియోజకవర్గం ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపట సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న శివకుమారి

గుంటూరు సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

ఉధృతంగా ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు పరిష్కరించకుండా తాత్సారం చేసి, కార్మికుల్ని సమ్మెలోకి నెట్టిందని, ప్రజలను నీటి కష్టాలకు గురిచేసిందన్నారు. సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్మికులు కోరుతున్నది గొంతెమ్మ కోరికలు కాదని, వారి శ్రమకు తగ్గ ఫలితం అడుగుతున్నారని, వారి డిమాండ్లు న్యాయమైనవని, ప్రజలు, మేధావులు, పట్టణ ప్రజలు అందరూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు పలకాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే వారు చేసే పోరాటంలో ప్రత్యక్షంగా భాగస్వాములు అవుతామని, ప్రజలందరినీ పోరాటాల్లోకి దించుతామని ఉద్ఘాటించారు.

అధికారుల అసత్య ప్రకటనలు మానుకోవాలి..

సమ్మె వల్ల నీటి సరఫరా అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో అధికారులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నారని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అన్నారు. సమ్మెలో ఉన్న కార్మికుల విధులకు హాజరైనట్లు అధికారుల తప్పుడు ప్రకటనలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. గుంటూరు నగరంలోని ప్రధానమైన హెడ్ వాటర్ వర్క్స్ కార్మికులు మొత్తం నిరవధిక సమ్మెలో ఉన్నారని స్పష్టం చేశారు. కార్మికులు, ప్రజల ఇబ్బందులను పరిష్కరించటానికి అధికారులు ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేయకపోగా ప్రజల్ని, కార్మికుల్ని మోసపూరిత ప్రకటనలతో గందరగోళానికి గురి చేయటం సరికాదన్నారు. ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకూ సమ్మె కొనసాగుందని చెప్పారు.

ఇదిలా ఉండగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతోపాటు పారిశుధ్య కార్మికులు సైతం బుధవారం నుండి సమ్మెబాట పట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో బైఠాయించారు. శిబిరాన్ని రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి సందర్శించి మద్దతుగా మాఇట్లాడారు. ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతుతోపాటు హామీలిచ్చిన కూటమి వాటిని విస్మరించిందని అన్నారు. కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగించలేక మైక్రోఫైనాన్స్ సంస్థల వద్ద అధిక వడ్డీల అప్పులు తీసుకుని తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమ్మె మరింత ఉధృతం కాక ముందే ప్రభుత్వం స్పందించాలని కోరారు. స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు షేక్ చిన్న, అల్లాబక్షు, సోమశేఖర్, కె.శ్రీను, బాలాజీసింగ్, బి.శ్రీను, కిరణ్‌కుమార్, మురళి, సామ్రాజ్యం, వెంకట్, వాసు, ఖాదర్, గౌస్, మాలిక్, సురేష్, రంగనాయకులు, కోటేశ్వరావు, షేక్ ఖాన్, పారిశుధ్య కార్మికులు సాల్మన్, వీరకుమార్, మల్లయ్య, యోహాన్, ఏసు, జీవరత్నం, విజయలక్ష్మి, ప్రసాద్, నరసింహారావు, జాన్ పాల్గొన్నారు.

కౌలురైతులకు మొండిచేయి

(మొదటి పేజీ తరువాయి)

కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు కేవలం 10 వేల మందికి మాత్రమే కార్డులు జారీ చేశారు. సిసిఆర్‌సి కార్డుల జారీలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయం లోపించిందని ప్రజా ప్రతినిధులు ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ శాఖ సహాయకులు కౌలుకు భూములు తీసుకున్న రైతులను గుర్తించి రెవెన్యూ శాఖకు సమాచారం ఇస్తే వారు కార్డులు జారీ చేస్తున్నారు. అయితే గతంలో గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు కార్డులు జారీ చేశారు. గత ఐదేళ్లుగా గ్రామసభలు నిర్వహించడం లేదు. ఈ-క్రాప్ నమోదు సమయంలోనే కౌలు రైతులను గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. కార్డుల జారీకి భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబ్బంధనను గత ప్రభుత్వం విధించడం వల్ల కౌల్దార్లకు ఎన్నో ఇబ్బందులు వచ్చాయి. ఈ నిబంధన ఎత్తివేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు చట్టసవరణ చేయలేదు.

విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

పార్టీల నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే ట్రూ అప్, ఇంధన సర్దుబాటు వంటి అదనపు ఛార్జీలతో విద్యుత్ బిల్లు రెట్టింపు అయ్యిందని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే మరింత భారం పడుతుందని అన్నారు. గంట గంటకూ రేటు కట్టి విద్యుత్ ఛార్జీలు వసూలు చేసే సదుపాయం స్మార్ట్ మీటర్లలో ఉందన్నారు. ముందుగా రీచార్జ్ చేసుకోవటం, రిమోట్ ద్వారా స్మార్ట్ మీటర్లను కంట్రోల్ చేస్తారని దీని వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం, భారాలు పెరుతాయని వివరించారు. అంతేకాకుండా స్మార్ట్ మీటర్లకు అయ్యే ఖర్చును కూడా వినియోగదారుల నుండే నెలనెలా బిల్లుతో కలిపి వసూలు చేస్తారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించి రూ.15వేల కోట్లకుపైగా విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. ఇప్పటికే వినియోగదారుల నుండి వసూలు చేసిన అదనపు ఛార్జీలు రూ.2787 కోట్లు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. 2019-25 మధ్య వసూలైన రూ.1500 కోట్లు బిల్లుల్లో మినహాయించాలన్నారు. అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, ప్రజావ్యతిరేక విద్యుత్ చట్ట సవరణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలపై నిరసనల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, సిఐటియు నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, విద్యుత్ వినియోగదారుల ఫోరం కన్వీనర్ అబ్దుల్ సలీం, జెవివి నాయకులు జి.వెంకట్రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి షేక్ ఖాసింవలి, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, సిపిఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, రైతు సంఘాల నాయకులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ పాల్గొన్నారు.

క్రోసూరులో సైకోకు అరదండాలు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఏమీ తెలియనట్లు కొడుకు కనబడట్లేదని అందరిని మభ్యపె ట్టేందుకు యత్నించినా భార్య ఫిర్యాదుతో నిజం వెలుగులోకి వచ్చింది. సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవిబాబు వివరాల ప్రకారం..

వెంకటేశ్వర్లు నాయక్, అతని కుమారుడైన మంగ్యానాయక్ (19) మేకలు గొర్రెలు మెపుతుంటారు. మంగ్యానాయక్‌కు తాత రామారావు కొంత పొలం, గొర్రెలను ఆస్తిగా రాశాడు. వీటిని తనకు అప్పగించాలని మంగ్యా నాయక్ తన తాత రామారావును కోరగా ఆయన వెకంటేశ్వర్లు నాయక్‌ను సంప్రదించి ఆస్తిని మంగ్యానాయక్‌కు అప్పగించాలని చెప్పాడు. దీనిపై కక్ష పెంచుకు వెంకటేశ్వర్లు నాయక్ తన కొడుకును చంపి ఎర్రబాలెం పొలంలో పూడ్చిపెట్టాడు. కొడుకెక్కడని భార్య నిలదీయడంతో కనిపించడం లేదని ఒకసారి, పొంతనలేని సమాధానం మరోసారి చెప్పడంతో ఆమె పోలీసులను ఫిర్యాదు చేశారు. వెంకటేష్ నాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా చంపినట్లు అంగీకరించాడు. అతని సమాచారంతో మంగ్యానాయక్ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నిందితుడు గతంలో తండ్రిని హతమార్చి జైలు జీవితం గడిపాడని, తన సొంత చెల్లిల్ని కూడా చంపాడని, తన 6 నెలల కొడుకుని సైతం చంపిన కేసులో సాక్ష్యాలు బలంగా లేని కారణంగా శిక్ష తప్పిందని గ్రామస్తులు చెబుతున్నారు. 2014లో తన తల్లిని అడవిలో నరికి చంపిన కేసులో ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడని పోలీసుల విచారణలో తేలింది. కేసుల నుండి బయటపడటానికి 150 గొర్రెలను మధ్యవర్తికి ఇచ్చాడని, మిగతా గొర్రెలను అమ్మి గుంటూరులోని ప్రముఖ వ్యక్తికిస్తూ చట్టంలోని లొసుగుల ద్వారా జైలుకెళ్లకుండా తప్పించుకుంటూ సొంత మనుషులనే చంపుతున్నాడని గ్రామస్తులు చెబుఉన్నారు. నిందితుడు మరోసారి బయటకు వస్తే తమనూ చంపుతాడని ఇద్దరు ముగ్గురు కుటుంబీకులు భయపడుతున్నారు. వెంకటేశ్వర్లు నాయక్ అరెస్టు సమయంలో ఆగ్రహానికి గురైన స్థానికులు అతనిపై భౌతికదాడి చేయబోగా పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం విఆర్ఒలు తొలుత క్రోసూరు తహశీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచారు.

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు సమ్మెబాట

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని లోని ఎర్రబాలెంలో బుధవారం మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరములో ఎంటిఎంసి రాజధాని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర క్యాబినెట్ పని గంటలు పెంచుతూ చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాన్నారు. 12వ తేదీ అర్ధరాత్రి నుండి సమ్మెలోకి దిగిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించాలని రవి కోరారు. వారికి జీవో నెంబర్ 36 అమలు జరిపి జీతాలు పెంచాలని రవి డిమాండ్ చేశారు. 16వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టారని ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని రవి అన్నారు. మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వం చేసిన ఒప్పందాల జీవోలను విడుదల చేయడానికి ప్రభుత్వం తాత్పర్యం చేస్తుందని అన్నారు. ఆప్కాస్ ను తీసేస్తామంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ కార్మికులు పని భద్రత విషయంలో ఆందోళన చెందుతున్నారని అన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఆందోళన ను ఉధృతం చేస్తామని రవి అన్నారు. కార్యక్రమంలో రాజధాని ప్రాంత మున్సిపల్ యూనియన్ కార్యదర్శి టి బాబు నాయకులు ఓ రామారావు టి ఆదిలక్ష్మి కే కోటేశ్వరి ఎం పార్వతి ఎన్ దివ్య గాంధీ కరిముల్లా ఎస్.కె సుభాని ఏడుకొండలు టీ చిన్న శ్రీను బాపట్ల అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎం రవి

నా చావుకు కారణం భార్యేనంటూ

సెల్ఫీ తీసుకొని ఆత్మహత్య

ప్రజాశక్తి- తాడేపల్లి

నా చావుకు కారణం నా భార్య అంటూ ఓ యువకుడు బుధవారం సెల్ఫీ తీసుకొని ఉరేసుకొని మరీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి తాడేపల్లి ఎస్సై ఎస్ కే ఖాజావలి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లి పట్టణంలోని నులకపేటకు చెందిన పోతురాజు బ్రహ్మయ్య(30) మంగళగిరికి చెందిన మోహన కౌసల్యకి గత సంవత్సరం ఆగస్టు 18న వివాహం జరిగింది. పెళ్లయిన దగ్గర నుండి భార్య నుండి వేధింపులు అధికమయ్యాయి. మనం వేరే కాపురం ఉందామని భర్త మీద భార్య కౌసల్య ఒత్తిడి తెచ్చింది. బ్రహ్మయ్యకు ఇష్టం లేకపోయినా భార్య ఒత్తిడి తట్టుకోలేక ఉండవల్లి సాయిబాబా గుడిసమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని కాపురం ఉంటున్నారు. ఆషాడ మాసం కావటంతో మోహన కౌసల్య పుట్టింటికి వెళ్లింది. బుధవారం పోతురాజు బ్రహ్మయ్య ఫ్యాను ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నా కొడుకు మృతికి కోడలే కారణమని పోలీస్ స్టేషన్లో మృతుడి తల్లి ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లి తాడేపల్లి ఎస్సై ఖాజావలి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆటోనగర్ ప్లాట్లను సేల్ డీడ్ చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఆటోనగర్లో ది మంగళగిరి ఆటో నగర్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్లాట్స్ యజమానుల సమావేశం జరిగింది. సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు షేక్ మహమ్మద్ జానీ అధ్యక్షత వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి జానీ మాట్లాడారు. పట్టణంలోని ఆటోమొబైల్స్ ఓనర్స్‌కు సుమారు 20ఏళ్ల కిందట ఆటోనగర్లో ప్లాట్స్ ఇచ్చారని సేల్ డీడ్ జరగలేదన్నారు. ఏపీఐఐసీ అధికారులు ప్లాట్స్‌కు సంబంధించిన డబ్బు కట్టించు కొని, ఆటోనగర్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ప్లాట్స్ అభివద్ధి చేయ లేదని వంకతో 62 ఫ్లాట్స్ రద్దు చేశారని, తిరిగి లబ్ధిదారులకు ప్లాట్లు అంద జేయా లని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్లాట్స్ ఓనర్ల సమస్యలు పరిష్కరించి ఆటోనగర్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి షేక్ అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు పోతిన పూర్ణచంద్రరావు, కోశాధికారి రుద్రు శివ, నాయకులు మున్వర్ బేగ్, హన్నన్, బుల్లా హరిబాబు పాల్గొన్నారు.

విత్తన, ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - మంగళగిరి

నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ సునీల్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని విత్తనాలు,ఎరువులు, పురుగు మందుల షాపుల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తన దుకాణాల్లో సరియైన పత్రాలు లేని కారణంగా రూ.3,30,850 విలువైన విత్తన విక్రయాలను నిలుపుదల చేశారు. పురుగుమందుల స్టాక్ బోర్డులు డిస్ప్లే చేయని రూ. 6,16,419ల విలువైన 510 లీటర్ల పురుగు మందుల విక్రయాన్ని నిలుపుదల చేశారు. సునీల్ మాట్లా డుతూ... ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖ- విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖల సం యుక్త ఆధ్వర్యంలో విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకా ణాల్లో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిం చరాదని డీలర్లను ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ చింతా రవిబాబు, మండల వ్యవసాయ అధికారిణి శైలజారాణి, గుంటూరు మండల వ్యవసాయ అధికారి బి. కిషోర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షల వల్ల రైతుకు మేలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని కట్రపాడు, నాగులపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి ఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.మోహన్‌రావు విచ్చేసినారు. రైతులకు భూసార పరీక్షలు వల్ల కలిగే ప్రయోజనాలు కలిగే విధంగా అపరాల్లో ముఖ్యంగా శనగ పంటలో వచ్చే వేరుకుళ్ళు తెగుళ్ల నివారణ, సమగ్ర సస్యరక్షణ గురించి రైతులకు వివరించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతులు అవసరం మేరకే ఎరువులను వాడుకోవాలని భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుదల కోసం పచ్చి రొట్ట విత్తనాలు పశువుల ఎరువులు పొలాల్లో వేసుకోవాలని తెలిపారు. నాగులపాడు మల్లికార్జున, ప్రశాంతి, లక్ష్మి రైతులు పాల్గొన్నారు.

2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు, తెనాలి.
O.S. No. 232/2015 I.A. No. 7/2025

బిట్వీన్ :
తాడిబోయిన శ్రీరామయ్య మరియు ఒకరు .... వాదులు
ఎదిరి
పసుపులేటి సుబ్బారావు (డైడ్) మరియు ఇతరులు
.... ప్రతివాదులు

D2: పసుపులేటి శ్రీనివాసరావు, తండ్రి : లేటు సుబ్బారావు, టీ వెండార్, 16వ లైన్, డోర్ నెం.06-16-21, అరండల్‌పేట, గుంటూరు.
D3 :శ్రీమతి తాడిబోయిన లక్ష్మి, భర్త : యజ్ఞ నారాయణ రాజు, గృహిణి, డోర్ నెం. 06-16-21, 16వ లైన్, అరండల్‌పేట, గుంటూరు.
D4 : పసుపులేటి కృష్ణ, తండ్రి : లేటు సుబ్బారావు, డ్రైవర్, డోర్ నెం. 06-16-21, 16వ లైన్, అరండల్ పేట, గుంటూరు.

ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా, పై కోర్టు నుండి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను తెలిసి కూడా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీరు హాజరు అవుటకు శ్రీ కోర్టువారు ది. 24-7-2025న ఉదయం 10-30 గం.లకు వాయిదా ఇచ్చివున్నారు. సదరు వాయిదాకి మీరు కానీ, మీ తరపు న్యాయవాది గారి ద్వారా గానీ మీ ఆక్షేపణలు తెలియపరచు కోగలరు. లేనియెడల మీ పరోక్షమున శ్రీ కోర్టువారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది : 24-7-2025

తెనాలి
తేది:11-07-2025

ఇట్లు
శ్రీ వెల్లంకి విశ్వేశ్వరశాస్త్రి,
వాదుల తరపు న్యాయవాది,
తెనాలి. సెల్ : 7799300284.

మహారాజశ్రీ పిడుగురాళ్ళ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో
O.S. No. 168/2024

బిట్వీన్ :
జలపాటి నాగలక్ష్మి ....వాది
మరియు
జక్క సత్యనారాయణ (డైడ్) His LR□s
1) దాసరి రజిని
2) బత్తుల హరిత ... ప్రతివాదులు

To,
D1 : దాసరి రజిని, W/o ఫిలిప్ D/o (late) జక్క సత్యనారాయణ, హిందు, వయస్సు 37 సం॥లు, హౌస్ వైఫ్, R/o. H.No. 5-15, మర్నిపేట, తెనాలి టౌన్ మరియు మండలం, గుంటూరుజిల్లా, గుంటూరు.

ఈ దావాలో మొదటి ప్రతివాది (D1) ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినప్పటికిన్నీ మొదటి ప్రతివాది (D1) దావా సమన్లను దురుద్దేశ్య పూర్వకంగా తీసుకొనక తిరిగి పంపుచున్నందు వలన మొదటి ప్రతివాదికి (D1) దావా సమన్లు ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసిన మొదటి ప్రతివాది (D1) హాజరు నిమిత్తం ఈ దావాను తేది. 31-7-2025నకు వాయిదా వేసినారు. కావున మీరు ఆ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై పై దావాలో మీ ఆక్షేపణలను తెలియజేయగలరు. లేని యెడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడమైనది

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

Madasu Venkateswara Rao
M.A., LL.B., Advocate
Piduguralla - 522 413.
Cell : 9908464246

NOTICE
IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION):: MANGALAGIRI
E.A NO.31/2023 IN E.P NO.26/2020 IN O.S NO.218/2017 AND E.A.NO.54/2023 IN E.P.NO. 26/2020 IN O.S.NO.218/2017

Between :
Chennupati Venkata Rao ....Petitioner/D.Hr
And
Konanki Pulla Rao .... Respondent/J.Dr

To,
Konanki Pulla Rao, S/o.Kotaiah, Ponnekallu(Vil), Tadikonda(Md), Guntur Dist.

పై నెంబర్లు ఇ.ఎ.నెం.31/2023 ప్రాపర్టీ డెలివరీ ఆఫ్ దావా షెడ్యూలు ఆస్తి మరియు ఇ.ఎ. నెం.54/2023 బ్రేక్ ఓపెన్ ది కీ ఆఫ్ దావా షెడ్యూలు ఆస్తి పిటీషనులలో రెస్పాండెంటు/ జె.డి.ఆర్.అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.28-07-2025 కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజున ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని, మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షంగా శ్రీ కోర్టు వారిచే విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది.28-07-2025

యస్.నిర్మల్ బాబు,
పిటీషనరు/డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్,
గుంటూరు, సెల్: 93941 07602

పొలం పాస్‌బుక్ పోయినది

పాశం నరేంద్ర S/o నరసింహం వయస్సు 39 అను నేను ది.04-04-2025 వ తేదీన సత్తెనపల్లి నుండి నరసరావుపేట వెళ్ళు బస్సు మాదలలో ఎక్కి ముప్పాళ్ళలో దిగాను. ఆ బస్సులో నా పొలం పాసుబుక్ పోయినది. ఖాతా నెంబర్ 3399. మాదల గ్రామం భూమి ముప్పాళ్ళ మండల తహసీల్దార్ గారిచే జారీ చేయబడినది. సర్వే నంబర్ 97-1B1 లో 0.75 సెంట్లు భూమి కలదు, ఈ విషయం యధార్థం. ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్ లో కూడా ఈ విషయమై ఫిర్యాదు చేయగలను. ఎవరికైనా పాస్‌బుక్ దొరికినచో క్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు

ఇట్లు
పాశం నరేంద్ర S/o నరసింహం
రుద్రవరం గ్రామం, ముప్పాళ్ళ మండలం
పల్నాడు జిల్లా. సెల్ నెం.8143558543

నోటీసు

మహారాజశ్రీ, పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 37/2024
O.S.No.18/2024

మన్నెపల్లి భాను ప్రసాదు వగైరా
పిటీషనర్లు 1 మరియు 2 వారలు మైనర్లు అయినందున వారి గార్డియన్ తల్లి మన్నెపల్లి జ్యోతి ... పిటీషనర్లు

Vs

మన్నెపల్లి నారాయణమ్మ వగైరా .. రెస్పాండెంట్స్
To
R2 మన్నెపల్లి గోపిచంద్, తండ్రి : వెంకటరావు, సిరిపురం గ్రామం,మెడికొండూరు మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు పిటీషనర్లు టెంపరరీ ఇంజక్షన్ పరిహారం కోరి పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. కావున నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయడల పై కోర్టు వారి ఎదుట తేది: **11-08-2025** ఉదయం గం॥10.30 ని॥ హాజరై తెలుపుకొనవలెను. లేని యడల నీకు పరోక్షంగా తీర్మానం చేయబడును.

వాయిదా తేది : 11-08-2025

ఇట్లు: **వి. శ్రీనివాసశాస్త్రి,**
టి. రామ మోహనరావు
న్యాయవాదులు, దరిశి మరియు పొదిలి, ప్రకాశం జిల్లా.

పొదిలి
తేది:16.07.2025

నోటీసు

మహారాజశ్రీ, పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.18/2024

మన్నెపల్లి భాను ప్రసాదు వగైరా
వాదులు 1 మరియు 2 వారలు మైనర్లు అయినందున వారి గార్డియన్ తల్లి మన్నెపల్లి జ్యోతి ... వాదులు

Vs

మన్నెపల్లి నారాయణమ్మ వగైరా .. ప్రతివాదులు
To
D2 మన్నెపల్లి గోపిచంద్, తండ్రి : వెంకటరావు, సిరిపురం గ్రామం,మెడికొండూరు మండలం, గుంటూరు జిల్లా.

పై నంబరు వాదుల నీపై డిక్లరేషన్ మరియు పర్మినెంటు ఇంజక్షన్ పరిహారం కోరి దావా దాఖలు చేసి ఉన్నారు. కావున నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయడల పై కోర్టు వారి ఎదుట తేది: **11-08-2025** ఉదయం గం॥10.30 ని॥ హాజరై తెలుపుకొనవలెను. లేని యడల నీకు పరోక్షంగా తీర్మానం చేయబడును.

వాయిదా తేది : 11-08-2025

ఇట్లు: **వి. శ్రీనివాసశాస్త్రి,**
టి. రామ మోహనరావు
న్యాయవాదులు, దరిశి మరియు పొదిలి, ప్రకాశం జిల్లా.

పొదిలి
తేది:16.07.2025

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: ఋణగ్రహీతలు: 1. ఫేవరెట్ ఫ్లెక్స్, ప్రొ. కాసిన సూర్య ప్రకాష్ రెడ్డి, డి.నెం.7-14-38, 6వ లైన్, 2వ క్రాస్ రోడ్డు, వల్లూరివారితోట, గుంటూరు-522002. **2. శ్రీ కాసిన సూర్య ప్రకాష్ రెడ్డి,** తండ్రి: రామకృష్ణ రెడ్డి, డి.నెం.25-16-48/ఏ, పొగాకు బోర్డు ఎదురుగా, 12/3 లేన్, శ్రీనివాసరావుపేట, గుంటూరు-522004. **సహ దరఖాస్తుదారు/హామీదారు: 3.శ్రీమతి షేక్ సబీహా భాను,** భర్త: కాసిన సూర్య ప్రకాష్ రెడ్డి, డి.నెం.25-16-48/ఏ, పొగాకు బోర్డు ఎదురుగా, 12/3 లేన్, శ్రీనివాసరావుపేట, గుంటూరు-522004.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీ కాసిన సూర్య ప్రకాష్ రెడ్డి కి చెందిన బకాయి వసూలు కొరకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.18-03-2024** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.09-09-2024** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఈ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఈ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఈ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 18-03-2024** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:
డాక్యుమెంట్ నెం.5825/2016, తేది: 17-10-2016: గుంటూరు, అమరావతి రోడ్డు, కొరిటెపాడు, టెలికాం నగర్, 2వ లేన్, డి.నెం.145/2, దగ్గరి డోర్.నెం.11-286లో పడమర వైపు 25 అడుగుల వెడల్పు రోడ్డు ఉంది, 150.00 చ.గ.ల నివాస ఖాళీ స్థలం కాసిన సూర్య ప్రకాష్ రెడ్డి గారికి చెందిన ఆస్తి, హద్దులు: **తూర్పు:** విక్రేత ఇతరులకు అమ్మిన ఆస్తి-27'-00", **ఉత్తరం:** కరసాని రామి రెడ్డి, కరసాని జయ చంద్ర రెడ్డి గారికి చెందిన ఆస్తి-50'-00", **పడమర:** 25 అడుగుల రోడ్డు-27'-00", **దక్షిణం:** కాంతం నిర్మలా దేవి గారికి చెందిన ఆస్తి-50'-00".

తేది: 30-06-2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: ఋణగ్రహీత: మెస్సర్స్ ఫారూక్ ట్రేడర్స్, ప్రొప్రయిటర్: శ్రీ షేక్ అబ్దుల్ రజాక్, షాప్ నెం. 18, బి.ఆర్. స్టేడియం కాంప్లెక్స్, పొన్నూరు రోడ్డు, గాలిబ్ మార్కెట్, గుంటూరు-522001. **హామీదారు: శ్రీ షేక్ సిద్ధిక్,** తండ్రి: సైదా, డోర్ నెం. 17-23-293/1, జి.కె. నగర్, సుద్దపల్లి డొంక, 2వ లైన్, రామలయం గుడి దగ్గర, ఆనంద్‌పేట, గుంటూరు-522003.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి అబ్దుల్ రజాక్ (మెస్సర్స్ ఫారూక్ ట్రేడర్స్ యొక్క ప్రొప్రయిటర్) కి చెందిన బకాయి వసూలు కొరకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.21-02-2022** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.04-04-2023** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఈ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఈ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఈ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 21-02-2022** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:
గుంటూరు జిల్లా, ప్రస్తుతం కొత్త గుంటూరు నగరపాలక సంస్థ, బుడంపాడు గ్రామ పంచాయతీ ఏరియా, డి.నెం. 173 లో గల 341.31 చదరపు గజాల విస్తీర్ణంలోని భూమి షేక్ అబ్దుల్ రజాక్, తండ్రి: అబ్దుల్ రహీం గారికి చెందినది. (ఓవర్‌హెడ్ ట్యాంక్ మరియు వినాయకుడి గుడి దగ్గర) **హద్దులు: తూర్పు:** వడ్డూరి పార్వతి గారి భూమి, **పడమర:** 12 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** 12 అడుగుల రోడ్డు, **దక్షిణం:** సబిహా బేగం గారి భూమి.

తేది: 01-07-2025 **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

మట్టి అక్రమంగా తరలుతున్నా.. అధికారులు పట్టించుకుంటేనా..?

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండలంలోని వన్నాయపాలెం పంచాయితీ సరిహద్దుల్లో మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. జెసిబి ఉపయోగించి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ పోరంబోకు అనే తేడా లేకుండా జెసిబితో నామరూపాల్లేకుండా చేస్తున్నారు. ఒక ట్రక్కును రూ.700 నుండి రూ.వెయ్యి వరకు విక్రయిస్తూ మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నా అడ్డుకోవడానికి అధికారులెవరూ పూనుకోపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఇళ్ల స్థలాలు కావాల్సినవారు గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ ఎన్.ధనలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటి స్థలం లేని వారు అర్జీతోపాటు రేషన్ కార్డు, కుటుంబీకుల ఆధార్ కార్డులు, పాస్‌ఫోటో జతపరచాలని తహశీల్దార్ పేర్కొన్నారు.

సిబ్బంది, ఉద్యోగులతో మాట్లాడుతున్న సుజయ్‌కుమార్

విద్యుత్ ఉత్పత్తిలో లక్ష్యాన్ని అధికమించాలి

ఏపి జెన్‌కో హైడల్ డైరెక్టర్ ఎం.సుజయ్ కుమార్

ప్రజాశక్తి -రెంటచింతల

విద్యుత్ ఉత్పత్తిలో టైల్‌పాండ్ ప్రాజెక్టు ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తారని, ప్రతి ఏటా లక్ష్యాన్ని అధిగమిస్తున్నారని ఏపీ జెన్కో హైడల్ (జల విద్యుత్) డైరెక్టర్ ఎం.సుజయ్ కుమార్ అన్నారు. సత్రశాలలోనే నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఉద్యోగులతో బుధవారం ఎంసీఆర్ (మెయిన్ కంట్రోల్ రూమ్)లో ఆయన సమావేశమయ్యారు. ప్రతి సంవత్సరం విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 78 ఎంయూలు కాగా ఈసారి 80 ఎం.యులకు పెంచి 2026 మార్చి 26 లోపు ఉత్పత్తి జరిగేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. ఈ ఏడాది 92.427 ఎంయూల విద్యుత్ ఉత్పత్తిలో లక్ష్యాన్ని సాధించారని అభినందించారు. గత 15 రోజుల నుంచి రెండు యూనిట్లు ద్వారా 4.47 ఏంయూల విద్యుత్తు తయారైనట్లు ప్రాజెక్టు ఎస్ఇ వెంకటరమణ వివరించారు. 20 రేడియల్ క్రస్ట్‌గేట్లను పరిశీలిస్తూ లీకుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా ఆన్‌స్కిల్డ్ ఉద్యోగులు తమ సమస్యలను డైరెక్టర్‌కు వివరించి క్యాడర్ ఉద్యోగులుగా మార్చాలని కోరారు. అనంతరం సుజయ్‌కుమార్ ప్రాజెక్టు ఆవరణ మొత్తాన్ని పరిశీలించారు. పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండడంపై అభినందించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ సమీపంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సీఈలు రాఘవేంద్రారెడ్డి, తిరుమల ప్రసాదు, నాగరాజు, వెంకటరమణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిడుగురాళ్ల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్... సత్తెనపల్లిలో ర్యాలీ చేస్తున్న ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు

పరిష్కరించకుంటే మరింత ఉధృతంగా సమ్మె

- నాలుగో రోజుకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె
- సత్తెనపల్లిలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులతో కలిసి భారీ ర్యాలీ
- పలు సంఘాలు, కార్మికుల మద్దతు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం డిఎంఎ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. ఇంజినీరింగ్ కార్మికులు నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న నేపథ్యంలో పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లోని సమ్మె శిబిరాన్ని ఆంజనేయులు నాయక్ బుధవారం సందర్శించి మాట్లాడారు. గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, ఆప్కాస్ సంస్థను రద్దు చేస్తే కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ పెన్షన్ సదుపాయం కల్పించాలని, మరణించిన వారి స్థానంలో వారి కుటుంబీకులకు అవకాశం కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, జీవో 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా సమ్మె శిబిరాన్ని సివిల్ సప్లయిస్ ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.వెంకటకృష్ణ, కార్మికులు సందర్శించి మద్దతు తెలిపారు. పిడిఎం రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు, సిటియు నాయకులు ఒ.కృష్ణ, ఆర్‌టిఐ జిల్లా నాయకులు కుమార్ మద్దతు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, పారిశుధ్య కార్మికులు ఎం.ప్రతాప్, బి.రామారావు, బి.అనిల్, గురవయ్య, సురేష్, ఆర్.శ్రీనివాసరావు, కె.చినవీరమ్మ, డి.లక్ష్మి, శౌరమ్మ, ఇంజినీరింగ్ కార్మికులు వి.శ్రీను, విజయ్, సురేష్, రత్నబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సమ్మెలో ఇంజినీరింగ్ కార్మికులతోపాటు కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులూ బుధవారం భాగస్వాములయ్యారు. పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. సిఐటియు పట్టణ కన్వీనర్ జె.రాజ్‌కుమార్ మాట్లాడారు.

పలు గ్రామాల్లో పల్నాడు కలెక్టర్ పర్యటన

సోలార్ పలకలను పరిశీలిస్తున్న కలెక్టర్.. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - రాజుపాలెం

పిఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారుల్ని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అభినందించారు. మండలంలోని గణపవరం, కూబాద్‌పురం, రాజుపాలెం, చౌటపాపాయపాలెం, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో కలెక్టర్ బుధవారం పర్యటించారు. గణపవరంలో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు వారితో మాట్లాడారు. సూర్యఘర్ పథకం ద్వారా ఉచిత విద్యుత్‌తో పాటూ ప్రభుత్వానికి విద్యుత్ అమ్మి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో 10 వేల మంది లబ్ధిదారుల ఇళ్లపై సూర్యఘర్ పథకం ద్వారా సౌర పలకలు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కుబాద్‌పురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి కాన్పులకు మొదటి ఎంపిక ప్రభుత్వ ఆసుపత్రులే అయ్యేలా సిబ్బంది పని చేయాలన్నారు. చౌటపాపాయపాలెం వద్ద ఉన్న డి.ప్రతాపరెడ్డికి చెందిన రెండున్నర ఎకరాల మామిడి తోటను పరిశీలించారు. బ్రాహ్మణపల్లెలో ఉపాధి హామీ కింద చేపట్టిన పంటకుంటలను పరిశీలించారు. వీటిపై రైతుల్లో చైతన్యం పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రమణాకాంత్‌రెడ్డి, డిఇఒ చంద్రకళ, తహశీల్దార్ దుర్గేష్, ఏపీఎంఐపీ పీడీ ఆంజనేయులు, డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి, ఎంపిడిఒ జి.వి. సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి శివసాకేత్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఇంటర్ విద్యార్థి కె.శివసాకేత్ 10వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్‌జూనియర్స్, జూనియర్స్ ఆక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్-2025కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్.సుధీర్ బుధవారం తెలిపారు. 50, 100, 200 మీటర్ల బటర్ ఫ్లై ఈవెంట్స్, 200, 400 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్స్‌కు శివసాకేత్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే పోటీల్లో పాల్గొననున్న శివసాకేత్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ- కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసాయి, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ యక్కల మధుసూదనరావు, కోచ్ జి.సురేష్ అభినందించారు.

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వ కమిటీ

జడ్జీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రాజీ మార్గమే రాజా మార్గమని, ఏళ్ల తరబడి పెండింగులో ఉన్న కేసులకు మధ్యవర్తిత్వం ద్వారా సత్వర పరిష్కారం పొందాలని మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్, సివిల్ జడ్జి వి.విజయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సివిల్ జడ్జి వి.విజయ్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎ.ఖౌషీద్ హుస్సేన్, మొదటి అదనపు సివిల్ జడ్జి పి.ప్రియదర్శిని, రెండో అదనపు సివిల్ జడ్జి జె.సుజన్‌కుమార్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రవేశపెట్టిన మధ్యవర్తిత్వం ద్వారా ఎలాంటి కేసులైనా వెంటనే పరిష్కారం చేసుకోవచ్చన్నారు. సత్తెనపల్లి కోర్టులో నూతనంగా మధ్యవర్తిత్వం కమిటీని నియమించామని, ఈ కమిటీ ప్రతిరోజూ కోర్టు ఆవరణలో ఉండి పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కారం చేసుందని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్‌కుమార్, ప్రభుత్వ న్యాయవాదులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్స్, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమస్తాలు, బార్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ పోలీసులు పాల్గొన్నారు

ప్రజాశక్తి - మాచర్ల

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తుల ప్రమేయం ఎంతో ఉపయోగమని న్యాయమూర్తి శ్రీనివాసకళ్యాణ్ అన్నారు. మధ్యవర్తిత్వం పట్ల అవగాహన కల్పించేందుకు స్థానిక కోర్టు నుండి బస్టాండ్ సెంటర్ వరకు మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఏదైనా వివాదంలో పరిష్కార మార్గాలుంటే సెక్షన్ 88 క్రింద ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విభాగానికి న్యాయమూర్తి పంపవచ్చునని తెలిపారు. కోర్టులోని ఇరుపక్షాలు మధ్యవర్తిత్వంతో కేసు పరిష్కారం చేసుకుంటామని మెమో దాఖలు చేయవచ్చునని వివరించారు. ర్యాలీలో పట్టణ సిఐ ప్రభాకరరావు, న్యాయవాదులు వై.రమేష్‌బాబు, జి.శ్రీనివాసరావు, ప్రభుత్వ న్యాయవాది జి.వెంకటేశ్వర్లు, జి.సత్యనారాయణరెడ్డి, మీడియేషనల్ అంశంపై శిక్షణ పొందిన సీనియర్ న్యాయవాది వై.కృష్ణమూర్తి, గంగుల శ్రీనివాసరావు, పి.అనిల్, విడుదల పుల్లారావు, శేశిరెడ్డి, గౌస్ బాషా పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి

మున్సిపల్ కార్మికులకు చట్ట ప్రకారం వేతనాలు పెంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా తాడేపల్లిలో బుధవారం సమ్మె విజయవంతమైంది. మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు జరిగిన సభకు సిఐటియు తాడేపల్లి నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశాఖపట్నంలో యోగా పేరుతో ఒక పూట కార్యక్రమానికి రూ.350 కోట్లు ఖర్చుపెట్టిన ప్రభుత్వం ఇది ఎవరి సొమ్మని ప్రశ్నించారు. రెక్కలు ముక్కలు చేసుకొని పట్టణాలు, పల్లెలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచమంటే డబ్బులు లేవనటం సిగ్గుగా అనిపించడం లేదా అని ముఖ్యమంత్రిని నిలదీశారు. కార్మికులతో ఒప్పందం చేసుకోవటానికి డబ్బులు లేవంటున్న సీఎం కోట్ల రూపాయలు అనవసర ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు జీతాలు పెంచుకోవడానికి అప్పటికప్పుడు జీవోలు ఇచ్చే ప్రభుత్వం, మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలను ఎందుకు అమలు చేయడం లేదన్నారు. పెరిగిన ధరలతో పాటు జీతాలు పెంచాలని, లేదంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలను వెంటనే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం పథకంతో పాటు సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా మున్సిపల్ కార్మికుల జీతాలు ఎందుకు పెంచరని ప్రశ్నించారు. జీతాలు పెంచమని అడిగితే, నిలదీస్తే ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరిస్తారా అని మండిపడ్డారు. కార్మికులపై వేధింపులకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులకు మన సమస్యలు వినడానికి తీరిక లేదని, నిత్యావసర సరుకుల ధరలు, కరెంటు చార్జీలు పెంచడానికి మాత్రం గంటలు తరబడి చర్చించి ప్రజలు నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, దొంత రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుండి మున్సిపల్ కార్మికులకు కొబ్బరినూనె, చెప్పులు ఇవ్వకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పల్లె కృష్ణ, ఎన్.దుర్గారావు, సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఏఐటియుసి నాయకులు టి.వెంకటయ్య, కార్మికులు వెంగమ్మ, సంతోషం, రాంబాబు, కామాక్షి, వేణు, డేవిడ్, సతీష్, మరియమ్మ, యమున, శశికళ, జి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న సిపిఎం, సిఐటియు నాయకులు

మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి

జడ్పీ హైస్కూల్లో ఈగల్ క్లబ్ ఏర్పాటు

ప్రజాశక్తి - తాడేపల్లి : గంజాయి, మాదక ద్రవ్యాలు వాడకాన్ని అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన యాంటీ నార్కోటిక్స్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులుతో కలిపి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఈగల్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పూర్తి ఆరోగ్యంతో విద్యనభ్యసించి మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. సిగరెట్, పాన్ పరాగ్, పొగాకు, గుట్కా వంటి చెడు అలవాట్లు కలిగిన వారికి వాటి వల్ల నష్టాలను వివరించి కట్టడి చేయాలని సూచించారు. తాడేపల్లి పోలీసు కానిస్టేబుల్ రమేష్ మాట్లాడుతూమత్తు పదార్థాల వాడకం అరికట్టడానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ తమ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణలు చట్ట విరుద్ధం

నిందితులపై చర్యలు తీసుకోవాలి - వెనిగండ్లలో బాధితులను పరామర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలోని వెనిగండ్ల గ్రామం బుడగ జంగాల కాలనీలో కులపంచాయతీ పేరుతో కుల బహిష్కరణ చేయడమే కాక లక్షల రూపాయలు పెనాల్టీలు వేస్తున్నట్లు వచ్చిన కేసుపై న్యాయవిచారణ జరిపి నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని సిపిఎం, కెవిపిఎస్ ప్రతినిధుల బృందం కోరింది. మంగళవారం వెనిగండ్ల గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతు నేటికీ కొన్ని సామాజిక తరగతుల్లో కుల పంచాయతీలు కొనసాగుతున్నాయన్నారు. ఇవి శృతి మించుతున్నాయని, శిక్షలు వేయడం, వాటిని నిరాకరించినవారికి కుల బహిష్కరణ చేస్తామని బెదిరించి పెద్దమొత్తంలో సొమ్ము వసూలు చేస్తున్నారని బాధితులు సిపిఎం బృందానికి తెలిపారన్నారు. సభ్యసమాజంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా న్యాయవిచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని రామారావు కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ ఈ కాలనీలో బుడిగజంగాల సామాజిక తరగతికి చెందిన విద్యార్థులకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి మాట్లాడారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు జె.నవీన్, వై.బర్నబాసు, కె.రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.


బాధితుల నుండి వివరాలు సేకరిస్తున్న పాశం రామారావు తదితరులు

సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ప్రభుత్వం

ప్రజాశక్తి - మంగళగిరి

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరించడంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య విమర్శించారు. మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి నాలుగో రోజు చేరింది. నాలుగో రోజు సమ్మెలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులు, బదిలీ కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు, ఎంబుక్ కార్మికులు అందరూ పాల్గొన్నారు. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మంగళగిరిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య మాట్లాడుతూ సమ్మె ప్రారంభించి నాలుగు రోజులు అవుతున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. అన్ని రకాల మున్సిపల్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని, ప్రజలకు ఆటంకం కలిగితే దానికి బాధ్యత వహించాలన్నారు. న్యాయమైన కోరికల కోసం సమ్మె చేస్తుంటే పట్టించుకో వడంలేదని విమర్శించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించిందని అన్నారు. తల్లికి వందనం పథకం అమలు చేయడం లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల చేస్తున్న న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు తెలియజే స్తుందని అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు పి.రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా ఎదుర్కొని నిలబడి ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వైఎస్సార్‌టియుసి నియోజక వర్గ అధ్యక్షులు ఆర్.శ్రీనివాస రాజు మాట్లాడుతూ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కె.జీవన్ సాగర్, సిఐటియు సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, సిఐటియు నాయకులు వి.వి.జవహర్‌లాల్, సిఐటియు మంగళగిరి రూరల్ కార్యదర్శి యు.దుర్గారావు, అభ్యుదయ కార్మిక సంఘం నాయకులు ఆర్.సాంబశివరావు, వైఎస్సార్‌టి యుసి పట్టణ అధ్యక్షులు నక్క నాగరాజు, పట్టణ నాయకులు ఎ.తిరుమలేశ్వ రావు, డి.అమ రేశ్వరరావు, ఫెడరేషన్ నాయకులు ఎం.శ్రీని వాసరావు, కె.శ్రీనివాస రావు, కేధార్‌నాథ్, పి.రాము, కె.వెంకటే శ్వరమ్మ, వై.శివనాగేశ్వర రావు పాల్గొన్నారు.

మంగళగిరిలో కార్పొరేషన్ కార్యాలయ గేటు వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, మంగళగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

స్మార్ట్ మీటర్లను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని నిలుపుదల చేయాలి, ట్రూ ఆఫ్ చార్జీలు ఇంధనపు సర్దుబాటు తదితర చార్జీలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చినకాకాని గ్రామంలో వట్రం పూర్ణయ్య అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగలకొట్టండని అన్నారు. తాము అధికారంలోకొస్తే స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని రాష్ట్ర ప్రజలకు వాగ్దానం చేసిన కూటమి నాయకత్వం ప్రస్తుతం ఆ ఒప్పందాన్ని రద్దు చేయకుండా అనుమతించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని వాగ్దానాలు చేసి అధికారం చేపట్టిన నాటినుండి ఇప్పటివరకు విద్యుత్ ఛార్జీలు రూపంలో 15,485 కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై వేసి, గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ విధానాలని అమలు చేస్తూ ఇంకా భారాలను వేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల వల్ల భవిష్యత్‌లో ప్రజల మీద అదనపు భారాలు పడతాయని, వీటిని వ్యతిరేకించాలని, ఇంధనపు సర్దుబాటు చార్జీలు తదితర చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు సమావేశంలో సిపిఎం మండల రూరల్ కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, బి.కోటేశ్వరి, గండికోట బాబువరప్రసాద్, సింహాద్రి సుమ, గడ్డం అజయ్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు

నేషనలైజ్డ్ బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు సేవలు

ది కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాంబాబు

ప్రజాశక్తి - తెనాలి

నేషనలైజ్డ్ బ్యాంకులకు దీటుగా ది కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ సేవలు విస్తరించాయని చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు చెప్పారు. స్థానిక దేవి చౌక్ లోని బ్రాంచ్ కార్యాలయంలో మంగళవారం బ్రాంచి మేనేజర్ బొప్పన వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా 1999లో స్థాపించిన కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుందన్నారు. 34 బ్రాంచీలతో రూ. 1710 కోట్ల టర్నోవర్, రూ.1000 కోట్ల డిపాజిట్లను సేకరించిందని చెప్పారు. రిజర్వ్ బ్యాంక్ పరిధిలో ఫుల్ సౌండ్ బ్యాంకుల జాబితాలో టాప్ త్రీలో ది కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ ఉందన్నారు. ఆసక్తిగల యువతకు ఎంఎస్ఎంఈ రుణాలను , చిన్న, మధ్య తరహా వ్యాపారాలను ప్రారంభించేందుకు లక్ష నుంచి రూ.25 కోట్ల వరకు అందించేందుకు బ్యాంక్ సిద్ధంగా ఉందన్నారు. బ్యాంకు సీఈఓ కె.శ్యామ్ కిషోర్ మాట్లాడుతూ తెనాలిలో బ్రాంచిని ప్రారంభించిన ఏడాది కాలంలో రూ.6 కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగాయన్నారు. బ్రాంచ్ మేనేజర్ బొప్పన వెంకటేశ్వరరావు వార్షిక నివేదికను సమర్పించారు. ఖాతాదారులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డి శాస్త్రి, రీజినల్ మేనేజర్ జాస్తి మురళి, ఖాతాదారులు, పలువురు పారిశ్రామికవేత్తలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట క్రిష్టియన్ పాలెం అంబేద్కర్ పురపాలక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం కాసేపు ఉపాధ్యాయునిగా మారి విద్యార్థులు పాఠాలు బోధించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి చిన్నారి జీవితంలో పాఠశాల విద్య ఒక మధుర ఘట్టమన్నారు. ప్రతి మనిషి జీవించడానికి గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో దేశం ప్రగతి బాటలో నడవడానికి, ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడడానికి విద్య అంతే అవసరమన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతం పెంచేందుకు మంత్రి నారాలోకేష్ అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టారన్నారు. విద్యార్థులు టివి, సెల్‌ఫోన్, కంప్యూటర్లకు దూరంగా ఉండాలనీ, పాఠ్యపుస్తకాలతో పాటు జ్ఞానాన్ని పంచె పుస్తకాలను చదువుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు పట్టికను, పాఠశాలలో నెలకొన్న మౌళిక సదుపాయాలను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని, విద్యతో పాటు సామాజిక విలువలు తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, గుత్తా అంకమ్మ చౌదరి పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠం స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - దుర్గి

సార్వత్రిక విద్యాపీఠం స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కే.వేణు బుధవారం తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా దూరవిద్యా విధానంలో ఇంటర్మీడియట్ చదువుకోవచ్చునని అన్నారు. కనీస వయసు 15 సంవత్సరాలు నిండి ఉండాలని గరిష్ట వయోపరిమితి లేదని, పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి ఒక సంవత్సరం ఖాళీగా ఉన్న విద్యార్థులకు, అనివార్య కారణాలవల్ల చదువు ఆపిన వారికి, మహిళలకు వయోజనులకు ఇంటర్మీడియట్ పూర్తి చేయడానికి ఇదొక మంచి అవకాశం అని ఆయన తెలిపారు. 31లోపు ఆఅప్లికేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని. తదుపరి విషయాలకు తనను సంప్రదించాలని ఆయన కోరారు.

న్యాయవాదిపై దాడికి నిరసన

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పగడ్బందీగా అమలు చేయాలని సత్తెనపల్లి భారత దేశం అధ్యక్షులు అజయ్‌కుమార్ డిబేట్ చేశారు, సత్తెనపల్లి పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. తుళ్లూరుకు చెందిన న్యాయవాది ఎమ్.మోహన రావు, అతని భార్యపై కొందరు సంఘ విద్రోహశక్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులుపై జరుగు తున్న దాడులను ఖండిస్తూ, ప్రభుత్వం న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు బి.ఎల్‌చిన్నయ్య, చిన్నంమణి బాబు, షేక్ జానీ ఖాజావలి, శ్రీనివాసరావు, రాజశేఖరుని గోపాల కృష్ణమూర్తి, చావాబాబురావు, జొన్నల గడ్డ విజయ్ కుమార్, బాలకోటయ్య, నాగహరిబాబు, బొక్కాసంగీతరావు, వెంకటేశ్వరరావు, వెంకటశివ, రాజవరపు నరసింహరావు, నాగుర్, సురేష్, యేసురత్నం, జోజి, రామాంజీ, మధు పాల్గొన్నారు.

హౌసింగ్ లేఅవుట్స్‌లో దొంగతనాలను అరికట్టండి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

హౌసింగ్ లేఅవుట్స్‌లో కరెంట్ మోటార్లు, పైపులైన్లు, విద్యుత్ తీగలు దొంగతనాలకు గురవుతున్నాయని, వీటివలన లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు హౌసింగ్ ఎఇ మరియదాసు అన్నారు. సదరు దొంగతనాలను అరికట్టి లబ్దిదారులకు మేలు చేయాలని తహశీల్దార్ కిరణ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణ శివార్లలో ఉన్న 21 లేఅవుట్స్‌లో 4,180 మంది లబ్దిదారులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చిందన్నారు. చాలా మంది గృహలు నిర్మిం చు కుంటున్నారని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. శివారు ప్రాంతం కావటంతో దొంగలు కరెంట్‌తీగలను, బోరు మోటార్లను, వాటి తీగలను దొంగిలిస్తున్నట్లు తెలిపారు.

తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పురుగుమందుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి విజిలెన్స్ అధికారులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపుల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి వ్యాపారులు అనుమతులు పొందిన విత్తనాలను, ఎరువులు, పురుగు మందులను మాత్రమే రైతులకు అమ్మాలని తెలిపారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో అధికారులు కన్నయ్య, అపర్ణ, జగదీశ్వరరెడ్డి, పాపకుమారి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుర్గి

మండల కేంద్రమైన దుర్గిలో పురుగుమందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పత్తి మిర్చి విత్తనాలకు ఎరువులకు సంబంధించిన బిల్లులను, ఎరువు మందుల గొడవలను తనికి చేశారు. విలేకరులతో మాట్లాడుతూ బిల్లులు సక్రమంగానే ఉన్నాయని, విత్తనాలు పురుగు మందుల అమ్మకం పూర్తయ్యేంతవరకు బిల్లులను జాగ్రత్తగా ఉంచాలని వ్యాపారస్తులకు సూచించామన్నారు. వ్యవసాయ కమిషనర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు సీఐ ఎన్ఎస్ఎస్ అపర్ణ ఎరువులు దుకాణాలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించామని తెలిపారు. కల్తీ మందులు, ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు మందులను విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు కే కన్నయ్య, క్రోసూరు మండల వ్యవసాయ అధికారి వేణుగోపాలు దుర్గి మండల వ్యవసాయ అధికారి వై అమీర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండలోని పురుగుమందులు, ఎరువులు, విత్తనాల షాపుల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు తనిఖీలు చేశారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్. ఢిల్లీ రావు ఆదేశాల మేరకు అంతర్ జిల్లా కమిటీగా ఏర్పాటైన అధికారులు ఏలూరు జిల్లా కోటరామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పిజి. బుజ్జిబాబు, విజయవాడ రీజినల్ విజిలెన్స్ విభాగం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహమ్మద్ ఉమర్, సత్తెనపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుబ్బారెడ్డి, వినుకొండ ఏవో జీ వరలక్ష్మి షాపుల్లో తనిఖీలు నిర్వ హించారు. ఎరువులు పురుగుమందులు విత్తనాలు షాపు లు లైసెన్సులు కలిగి ఉండి స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిసుల వివరాలను తనిఖీ చేశారు. ప్రతి డీలర్ తప్పనిసరిగా స్టాక్ బోర్డు నిర్వహించాలని, స్టాక్ వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో రోజు అప్డేట్ చేయాలని ఎమ్మార్పీలకు మించి విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోదాముల్లో నిలువ ఉన్న ఎరువులను పరిశీలించారు.

పి4పై అపోహలు తొలగించండి : కలెక్టర్ అరుణ్‌బాబు

శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పి4 (పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ భాగస్వామ్యం)- పేదరికం నిర్మూలన కార్యక్రమంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని నియోజకవర్గాల విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్ల సిబ్బందిని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో పీ4 జనాభా నిర్వహణ కార్యక్రమాలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ పి4 కార్యక్రమంలో భాగస్వాములైతే ఇతర ప్రభుత్వ పథకాలకు దూరం అవుతామేమోనని బంగారు కుటుంబాలు, మార్గదర్శకులలో నెలకొన్న అభద్రతాభావం తొలగించాలన్నారు. పలు పారిశ్రామిక వేత్తలు, సంస్థలు ఇప్పటికే చేపడుతున్న పేదరిక నిర్మూలన కార్యక్రమాలను పీ4 కార్యక్రమాలుగా గుర్తిస్తామన్నారు. బంగారు కుటుంబాల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. జనాభా నిర్వహణ కార్యక్రమం ద్వారా ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలని కనడం జాతికి ఎంత అవసరమో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా తల్లికి వందనం, స్థానిక ఎన్నికలలో పోటీ చేసే అవకాశం, ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయడం వంటి నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుందన్నారు. కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాస్, ఆర్డీఓలు కె.మధులత, రమణా కాంత్ రెడ్డి, జీఎస్డబ్ల్యుఎస్ జిల్లా నోడల్ అధికారి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు మహర్దశ

రూ 2.70కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్

ప్రజాశక్తి - మాచర్ల

కూటమి ప్రభుత్వంలో మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు మహర్దశ పట్టనుంది. మార్కెట్ యార్డ్ ఆవరణలో గుంటూరు ప్రధాన రహదారికి పక్కన ఉన్న ప్రధాన ద్వారం ఇరుపక్కలా నూతనంగా 24 కమర్షియల్ షాపుల నిర్మాణాలకు రూ 2 కోట్ల 7లక్షల 50 వేల నిధులను కేటా యిస్తూ ఎపి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో నూతన షాపుల నిర్మాణంతోపాటు మార్కెట్ యార్డ్ ఈశాన్యంలో నుంచి రాకపోకలు సాగించేందుకు నూతనంగా ఆర్చీ నిర్మించి, గేటును కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పల్నాడు ప్రాంతంలో అత్యంత వెనుకబడిన నియోజకవర్గమైన మాచర్లకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. త్వరలో ఈ నిర్మాణాలకు సంబంధించి త్వరలో జిల్లా, రాష్ట్ర నాయకులు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. యార్డు ఆదాయాన్ని పెంపొందించడానికి నూతనషాపుల నిర్మాణాలు దోహద పడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆయిల్ ఫాం సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైతుల ఆర్థిక అభివృద్ధికి ఆయిల్ ఫాం సాగు ఎంతగానో దోహదపడుతుందనీ, నీటినీ ఆదా చేయడంతో పాటు అంతర్ పంటల వలన రైతులకు అధిక ఆదాయం వస్తుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి మండలంలోని భట్లూరు గ్రామంలో ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్. అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు పల్నాడుజిల్లా ఉద్యానవన శాఖ, గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన జిల్లాలో మొదటి విడతలో ఆయిల్ ఫామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 8 మండలాల్లో సత్తెనపల్లి, రాజుపాలెం ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఆయిల్ ఫామ్ ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా తట్టుకుంటుందన్నారు. జిల్లా ఉద్యాన అధికారి వెంకట్రావు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు గురించి రైతులకు వివరించారు. గోద్రెజ్ ఆగ్రోవిట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డీజీఎం

పఠనం చేయిస్తున్న ఎమ్మెల్యే

మురళి మాట్లాడుతూ సత్తెనపల్లి మండలంలోని దాదాపు గా 250 ఎకరాలను ఆయిల్ ఫామ్ సాగు కు గుర్తించామని చెప్పారు. కంపెనీ ద్వారా ఆయిల్ ఫామ్ గలలను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఉద్యానశాఖ అధికారికి సురేష్ మార్కెట్ యార్డ్ చైర్మన్ శోభారాణి, సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళఅమరేశ్వరరావు, భట్లూరు సర్పంచ్ రామారావు, టిడిపినాయకులు దరువూరి నాగేశ్వర రావు, మక్కపాటి రామచంద్రరావు, లగడపాటి గజానన పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర ఇవ్వకుండా కిసాన్ మేళాలు ఎందుకు? : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా నేడు నడికుడి మార్కెట్ యార్డ్‌లో కిసాన్ మేళాలు ఎలా పెడతారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు గిట్టు బాటుధర కల్పించాలంటూ వైసీపీ చేస్తున్న నిరసనలను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం రైతులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని అన్నారు. ఈ సంవత్సరం పత్తిపంట కూడా గిట్టుబాటు ధరలేదని పొగాకు రైతులు గిట్టుబాటు ధర కల్పించాలంటూ రోడ్డుకి ఆందోళన చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నడికుడి మార్కెట్‌యార్డులో పత్తి కొనుగోలు కేంద్రమే కాకుండా మిర్చి కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేశామని గుంటూరు మార్కెట్ యార్డుకు ధీటుగా ఉండే విధంగా ప్రత్యేకంగా మిర్చి కొనుగోలుకు అభివృద్ధి చేశామని అన్నారు. గుంటూరు మిర్చియార్డుకు ధీటుగా నడికుడి మార్కెట్ యార్డును తీర్చిదిద్దాలని అవసరమైన కోల్డ్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అతివేగం ప్రాణాంతకమని అతివేగం కొన్ని సందర్భాలలో విలువైన ప్రాణాన్ని బలిగొంటుందని నరసరావుపేట 1వ పట్టణ సిఐ ఎంవి చరణ్ వాహనదారులను హెచ్చరించారు. పట్టణంలోని స్టేషన్‌రోడ్డులో బుధవారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో భాగంగా త్రీబుల్ రైడింగ్, మైనర్ల డ్రైవింగ్, ప్రమాదకరమైన (రాష్, నెగ్లిజెంట్) డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలు, వాహన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినవారిపై కేసులు నమోదు చేశామన్నారు. సిఐ మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల ద్విచక్ర వాహనాల చోరీలు అధికంగా జరుగుతున్నాయని నేరాలను అరికట్టేందుకు విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్‌లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మైనర్లు వాహనం నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రైతులు బీమాను ఉపయోగించుకోండి

ప్రజాశక్తి పెదకూరపాడు

ఖరీఫ్ 2025లో ప్రత్తి సాగు చేయు రైతులు వాతావరణ ఆధారిత పంటల బీమా, వరి, కంది, ఎర్ర మిరప సాగుచేయు రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటలు బీమా చేయించుకోవాలని పెదకూరపాడు మండల వ్యవసాయశాఖాధికారి డి.కృష్ణయ్య కోరారు. ఆయన మాట్లాడుతూ పంట సాగు చేయు రైతులు వాతావరణ ఆధారిత పంటల బీమాకింద ఎకరాకు రూ.1900లు చొప్పున ప్రీమియం జులై 15 లోపు చెల్లించి పంటల బీమా చేయించుకోవాలన్నారు. బ్యాంక్ రుణాలు తీసుకొన్న రైతులకు ప్రీమియం రైతు రుణ మంజూరు సమయంలో బ్యాంక్ లోన్ నగదు నుండి రైతు అనుమతితో బ్యాంక్ వారు బీమా కంపెనీకి జమ చేయవచ్చునన్నారు. రైతులు కామన్‌సర్వీస్ సెంటర్, పోస్టాఫీసు, గ్రామ సచివాలయంలో డిఎ ద్వారా బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించ వచ్చునన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

అర్బన్ సీఐ రమేష్

ప్రజాశక్తి- చిలకలూరుపేట

పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థినుల భద్రతకు, ఈవ్ టీజింగ్, దురాలవాట్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అర్బన్ సీఐ పి. రమేష్ అన్నారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్లో బుధవారం మాట్లాడుతూ పట్టణంలో గాంధీనగర్, సుబ్బయ్యతోట, శారదా హైస్కూల్, ఈస్ట్‌క్రిస్టియన్‌పేట, బీఆర్‌ఐజీ పండరీపురంలో విద్యాసంస్థలు ఉన్నాయని తెలిపారు. కొంతమంది ఆకతాయిలు ఆ సెంటర్ల వద్ద నిలబడి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి వచ్చే సమయాల్లో ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారని సమాచారం అందిందన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో కొన్ని టీమ్‌లను ఏర్పాటు చేసి రోజు అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇస్తున్నానన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన వారిని తీసుకువచ్చి కౌన్సిలింగ్ చేసి పంపిస్తున్నామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామనీ, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని సీఐ రమేష్ హెచ్చరించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

మధ్య వర్తిత్వంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 89 కింద పరిగణించేదే మధ్యవర్తిత్వం అని తెనాలి మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షులు, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 90 రోజుల కార్యక్రమాల్లో భాగంగా బుధవారం తెనాలి కోర్టు ప్రాంగణంలో మధ్యవర్తిత్వం దేశం కోసం అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్టు ఆవరణ నుంచి కొత్తపేట మీదుగా గాంధీచౌక్ వరకు వన్‌కె రన్ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 11వ జిల్లా అదనపు న్యాయమూర్తి డి.శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.ఇందిరాప్రియదర్శిని, పవన్ కుమార్, వివేక్ వర్ధన్, రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, న్యాయ వాదులు పిల్లి రమేష్, భవాని, పారా లీగల్ వాలింటర్స్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్ల పూడికతీతను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో మెరుగైన పారిశుధ్యం అమలుకు ప్రజలు సహకరించాలని మునిసిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. 33వ వార్డులో బుధవారం నిర్వహించిన స్పెషల్ శానిటేషన్ పనులను ఆమె పర్యవేక్షించారు. వార్డులో మురుగునీటికి సంబంధించిన సమస్యలను వార్డు కౌన్సిలర్ మొఘల్ రహమత్ బేగ్ ఆమెకు వివరించారు. కాలువలో పూడికతీతపై పారిశుధ్య కార్మికులకు, శానిటరీ సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ముచ్చు ఏసుబాబు, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైడ్ డ్రెయిన్లకు శంకుస్థాపన..

స్థానిక గురవయ్య కాలనీ 4వ లైన్‌లో రూ.7.20 లక్షల అంచనాతో సిసిరోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి ఛైర్‌పర్సన్ తాడి బోయిన రాధిక శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వి.లక్ష్మీపతిరావు, మునిసిపల్ ఇంజనీర్ శ్రీకాంత్, మునిసిపల్ డిఇ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజనీర్ సూరిబాబు, కె.హరీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్

యార్డును అభివృద్ధిపథంలో నడుపుతాం

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డును అభివృద్ధి పథంలో నడుపుతామని ఛైర్మన్ ఉన్నం ఝాన్సీ అన్నారు. బుధవారం కమిటీ సభ్యులతో మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యార్డ్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. పనిచేసి హమాలీల సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపిపి ఎన్నికల శ్రీకృష్ణ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు కేశంనేని శ్రీఅనిత, విద్యార్థి సెక్రటరీ జె.వి.సుబ్బారావు, వైస్ చైర్మన్ కిషోర్, డైరెక్టర్లు కాసరనేని జస్వంత్, జోగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో దాదాపు అందరూ డాక్టర్లు ఉన్నారని, ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి గుంటూరు డిసిహెచ్ బి.రంగారావు అన్నారు. బుధవారం ప్రత్తిపాడు నియోజక వర్గ కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హాస్పటల్‌పై సదభిప్రాయం ఉండేది కాదని, ప్రస్తుతం తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి ఆకస్మిక తనిఖీ చేశానన్నారు. నార్మల్ డెలివరీలు, సిజేరియన్ చేయడానికి కూడా అత్యాధునిక పరికరాలతో పాటు సీనియారిటీ కలిగిన సివిల్ అసిస్టెంట్ సర్జన్, అనస్తీషియా డాక్టర్ వర్ధ శ్రీ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ జనరల్ పావని జనరల్ సర్జరి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పీడియాట్రిక్ నాగార్జున, డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. బుధవారం సిజేరియన్ చేసినట్లు తెలిపారు. డాక్టర్లు ఎవరైనా హాస్పటల్‌లో అందుబాటులో లేక పోతే వారికి 3 సార్లు షోకాజ్ నోటీసులు ఇస్తామని, అప్పటికి పద్ధతి మార్చుకోక పోతే వారికి ఛార్జ్ మెమో జారీ చేసి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి డెవలప్ మెంట్ కమిటీ మెంబర్ సుబ్రమణ్యం, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

డెలివరీ చేసిన డాక్టర్లతో డిసిహెచ్ఎస్

గుండాలపాడు దాసుల కాలనీలో నీటి ఎద్దడి

చేతి పంపులు పనిచేయక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని గుండాలపాడు దాసుల కాలనీలో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. కాలనీలో ఏర్పాటు చేసిన రెండు చేతి పంపులు ఏడు నెలలుగా పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో నీటి లభ్యత తక్కువగా ఉంది. ఇలాంటి సమయంలో రెండు ప్రధాన నీటి వనరులు పనిచేయకపోవడం వల్ల కాలనీలో ఉన్న వంద కుటుంబాల ప్రజలు పొద్దున మొదలుకొని దూర ప్రాంతాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాలనీలో ఉన్న రెండు చేతి పంపులను తక్షణమే మరమ్మతు చేయించాలని, శాశ్వత నీటి సరఫరా కోసం అధికారులు ముందడుగు వేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం అధికారులకు చెప్పినా ఇంతవరకు పట్టించుకోలేదని వాపోతున్నారు.

పనిచేయని చేతి పంపు

మంత్రి లోకేష్ ప్రజాదర్బార్‌కు తరలి వచ్చిన ప్రజలు

ప్రజాశక్తి - తాడేపల్లి

మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు ప్రజలు తరలి వచ్చారు. ప్రతి ఒక్కరిని స్వయంగా కలిసిన మంత్రి.. వివిధ సమస్యలపై వారి నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అతాగే వ్యాపారంలో వాటా ఇస్తానంటూ కాకినాడకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అనుచరుడు కె.రాజభాస్కర రెడ్డి రూ.1.77 కోట్ల మేర మోసం చేశాడని, విచారించి తగిన న్యాయం చేయాలని బాపట్లకు చెందిన దొప్పలపూడి విష్ణు మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో 19 సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 2,400 మందికి హెచ్ఆర్ పాలసీ లేదా మినిమమ్ టైమ్ స్కేలు ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. కృష్ణా బాపులపాడు మండలం మల్లవల్లిలో ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 2016లో ప్రభుత్వం భూములు సేకరించిందని, అయితే కొంతమంది రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని గ్రామానికి చెందిన డి.వెంకట్రావు మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అనేక సమస్యలను మంత్రి దృష్టి ప్రజలు తీసుకొచ్చారు. ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి లోకేష్

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు

అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 19 మందికి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సిఎం నారా చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో చేబ్రోలు మండల తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

మండల కేంద్రమైన చేబ్రోలు గ్రామంలో ముస్లిం ఏరియాలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా చట్టం మరియు న్యాయ , మైనారిటీ సంక్షేమశాఖ మాత్యులు ఎన్.ఎండి ఫరూక్, పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హాజరయ్యారు. అలానే గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో తక్షణమే ఆ సమస్యలను పరిష్కరించాలని స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి.ఉషారాణి, తహశీల్దార్ కె.శ్రీనివాస్‌శర్మ, డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

225వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 225 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలలో ఇ.శారమ్మ, టి.దుర్గాభవాని, వై.రమాదేవి, ఎస్.కె. హిమాంబి, ఉప్పుకాసమ్మలు కూర్చున్నారు. ఈకార్యక్రమంలో డి.నాగేశ్వ రావు, ఎం.ఆశీర్వాదం, వై.చిన్నసుబ్బారావు, తుపాకుల నాగేశ్వరావు, ఎం.గురవయ్య, షేక్ సుభాని, సింగ్, హగ్గయ్య, షేక్ ఆరిఫ్, యం.శారద, రమణమ్మ, రిబ్కా, సువర్ణ కుమారి, శివకుమారి, నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని ప్రతిరోజు పరిశీలించాలి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో రక్షిత మంచినీటి శాంపిళ్లను ప్రతిరోజు సేకరించాలని కమిషనర్ వి.లక్ష్మీపతిరావు అధికారులను ఆదేశించారు. బుధవారం పలు వార్డులలో ఆయన పర్యటించారు. 10వ వార్డు నాజరు పేట మహాలక్ష్మీ చెట్టు ప్రాంతం, 11వ వార్డు గురవయ్య కాలనీలో మునిసిపల్ తాగునీటి శాంపిల్స్‌ను పరిశీలించారు. స్థానికులతో మంచినీటి సరఫరాపై మాటా డారు. పారిశుధ్య కార్మికుల హాజరు శాతం, కార్యాలయంలో నిర్వహిస్తున్న రికార్డుల వివరాలు తెలుసుకున్నారు. కార్మికులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంహెచ్ఒ డాక్టర్ యేసు బాబు, వార్డ్ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మాతా శిశు మరణాలు తగ్గించేందుకే కిల్కారి ప్రోగ్రాం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మాతా శిశు మరణాలు తగ్గించేందుకే కిల్కారి ప్రోగ్రామ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అధికారి రాజు తెలిపారు. బుధవారం ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి యూపిహెచ్‌సిలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు కిల్కారి ప్రోగ్రాం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రోగ్రాం ద్వారా తల్లి, బిడ్డల ఆరోగ్య సమాచారం అందిస్తారని, నాలుగవ నెల మొదలుకొని పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు కాల్స్ వస్తాయన్నారు. వారానికి ఒకసారి గర్భిణీ, బాలింతల మొబైల్‌కు వాయిస్ కాల్స్ వస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూపిహెచ్‌సి వైద్యులు ఎస్.నాగేంద్రబాబు, ఏఎన్ఎం సుమలత, ఆశా వర్కర్లు కోలంటి శ్యామల,కె.భారతి తదితరులు పాల్గొన్నారు.

టిబి ముక్తభారత్ అభియాన్‌పై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి

పెదరావూరు సుగాలి కాలనీలో టిబి ముక్తభారత్ అభియాన్‌పై అవగాహన బుధవారం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిజిహెచ్ టిబి యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ టిబి రహిత గ్రామంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రెండు నెలలలో విస్తృతంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి సర్వే చేసినట్లు చెప్పారు. గడిచిన ఐదేళ్లలో క్షయ వ్యాధికి మందులు వాడిన వారిని, వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులను స్క్రీనింగ్ చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. టిబి యూనిట్ హెచ్‌వి సరోజినీ మాట్లాడుతూ తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో అధునాతన టిబి టెస్ట్ పరికరం అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో టిబి యూనిట్ ఫీల్డ్ హెల్త్ విజిటర్ వాకా వెంకట దిలీప్, ఎంఎల్‌హెచ్‌పి కె.లక్ష్మీ, కళాజ్యోతి, ఏఎన్ఎమ్‌లు శ్రీలక్ష్మి, ఎ.అరుణ, ఆశా కార్యకర్త జి. సుజాత, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి

ర్యాగింగ్ నిరోధానికి చర్యలు : డిఎస్పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిరోధానికి చర్యలు తీసుకుంటున్నట్టు డిఎస్పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చలమయ్య జూనియర్ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ అనేది మానవత విలువలను చెరిపేసే, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రక్రియ అని ర్యాగింగ్ వల్ల విద్యార్థుల ఆత్మవిశ్వాసం దెబ్బతినడమే కాకుండా, వారిపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని తెలిపారు.విద్యార్థులందరికీ ర్యాగింగ్ కు వ్యతిరేకంగా చట్టపరమైన వివరాలు, శిక్షల గురించి తెలియజేస్తూ, ప్రతి ఒక్కరు ఒకరిపట్ల మరొకరు స్నేహపూర్వకంగా, బాధ్యతతో నడుచుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ విభాగం తరఫున, విద్యాసంస్థల్లో శాంతియుత వాతావరణాన్ని కాపాడటమే లక్ష్యంగా ర్యాగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.ఏదైనా విద్యాలయాల్లో ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడుతుంటే వెంటనే అటువంటి సమాచారాన్ని స్థానిక పోలీస్ వారి దష్టికి గానీ, డయల్ 112 కి గానీ తెలియపరచాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబద్ర గారు, లెక్చరర్ ఏ.వి. శర్మ, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

టైఫాయిడ్ వ్యాక్సిన్‌పై హిందూ ఫార్మసీలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న రామకృష్ణ

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో ఫార్మాసుటికల్ రెగ్యులేటరీ అఫైర్స్ డిపార్టుమెంటు వారు టైఫాయిడ్ వాక్సిన్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భారత్ బయోటెక్ ఏరియా సేల్స్‌మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ తాము నూతనంగా ప్రవేశ పెట్టిన టైఫాయిడ్ వాక్సిన్ (టిసివి)ని గురించి అవగాహన కల్పించారు. ప్రపంచంలో ప్రతి ఏటా 4.5 మిలియన్ టైఫాయిడ్ కేసులు వస్తున్నాయని, వారిలో 1,10,000 మంది టైఫాయిడ్ బారిన పడి చనిపోతున్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ తెలియచేసిందన్నారు. ఈ సందర్భంగా టైఫాయిడ్ జ్వరం లక్షణాలు, అవసరమైన పరీక్షలు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్స విధానాల గురించి తెలియచేశారు. ఈచికిత్సకు వివిధ యాంటిబయాటిక్స్ వాడుచున్నందున మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్ సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. భారత్ బయోటెక్ సంస్థ వారు డాక్టర్ కష్ణ ఎల్లా పర్యవేక్షణలో తయారు చేసిన టైఫాయిడ్ వాక్సిన్ తీసుకొనడం వల్ల టైఫాయిడ్‌ని నివారించవచ్చని అన్నారు. టైఫాయిడ్ వాక్సిన్ డోస్, భద్రపరిచే విధానం తీసుకోవాల్సిన పరిశుభ్రత, జాగ్రత్తలు తెలియచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా.డి. డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, బయోటెక్నాలజీ డిపార్టుమెంటు హెచ్.ఓ.డి. డాక్టర్ జె.శివజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న తులసి యోగీష్‌చంద్ర, తదితరులు

ఎంఎస్‌ఎంఇల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

నూతనంగా ఏర్పడిన లఘు ఉద్యోగ భారతి నూతన రాష్ట్ర కమిటీ బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావును మంగళగిరిలోని వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరిస్తూ కమిటీ ఒక వినతిపత్రాన్ని సమర్పించింది. అధిక పారిశ్రామిక విద్యుత్ ఛార్జీలు, ప్రభుత్వ శాఖల నుండి ఆలస్యంగా చెల్లింపులు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత, ఆర్థిక సహాయం పొందడంలో ఇబ్బందులు, మెమోరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్‌పై అధిక ఛార్జీలు తదితర సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్ఎంఈల ప్రోత్సాహం, అభివృద్ధి కోసం లఘు ఉద్యోగ భారతితో కలిసి పని చేయడానికి పూర్తి మద్దతు ఇస్తానని ఆయన ప్రతినిధి బందానికి హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా నూతన కమిటీకి, అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన తులసి యోగిష్‌చంద్రకు శివశంకరరావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షులు తులసి యోగిష్‌చంద్ర, కోశాధికారి ధరణీష్, ఉపాధ్యక్షులు కమల్ నయన్ భాంగ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి తోట రామకష్ణ, ఈసీ సభ్యులు విఠల్ ప్రసాద్ ఉన్నారు.

మంగళగిరిలో ఇళ్లు లేని పేదలకు త్వరలో శాశ్వత పట్టాలు

నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షలో కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలకు త్వరలో శాశ్వతఇళ్ల పట్టాలు, టిడ్కో ఇళ్ల మంజూరు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలక్టరేట్‌లో మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలంగా వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివాసం వుంటున్న పేదవారికి మంత్రి నారా లోకేష్ శాశ్వత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించినందున దేవాదాయ, ఆర్అండ్‌బి, జెడ్పీ, మున్సిపల్ , రైల్వే శాఖల అధికారులు సమన్వయంతో ఆగస్టు నాటికి ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదవారి కోసం టిడ్కో గృహ సముదాయల నిర్మాణం కోసం స్థల సేకరణ చేయాలని కోరారు. ప్రస్తుతం వున్న టిడ్కో గృహ సముదాయల వద్ద వున్న పార్కును అభివృద్ధి చేయాలని యంటీయంసీ అధికారులకు సూచించారు. యంటీయంసీ పరిధిలో సమీకృత అండర్ డ్రైనేజ్ పనులు త్వరలో ప్రారంభించే చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులైన కూరగాయలు , పూలు, పండ్ల మార్కెట్లు, చేపల మార్కెట్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్థలాలకు సంబంధించి గౌరవ కోర్టుల పరిధిలో వున్న అంశాలను త్వరలో పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, డిఆర్ఓ ఎన్.ఎస్.కే.ఖాజావలి, జెడ్పీ సిఇఓ జ్యోతిబసు, పీడీ హౌసింగ్ ప్రసాద్, యంటీయంసీ కమిషనర్ అలీం బాష , సిటి ప్లానర్ అశోక్ , ఆర్ అండ్ బి, దేవాదాయ, మున్సిపల్, రైల్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు : దేశం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని మా అడ్వాన్స్డ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ అధిపతి డాక్టర్ మందపల్లి ఆదినారాయణ అన్నారు. స్థానిక ఎన్‌జిజిఓ కాలనీలోని సుమేధా హైస్కూల్లో నిర్వహించిన ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ అనే కార్యక్రమంలో ఆదినారాయణ మానవ అవయవాల పనితీరు, గర్భస్థ శిశువు కదలికలు, సిటి స్కాన్, ఎంఆర్ఐ, ఆల్ట్రా సౌండ్ మొదలైన పరికరాల పనితీరును వివరించారు. సుమేధా డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దటానికి తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివిధ పరికరాల గురించి వివరిస్తున్న ఆదినారాయణ

22న గుంటూరులో జాబ్ మేళా : గల్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నిరుద్యోగ యువతకు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు ఈనెల 22న గుంటూరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ జాబ్ మేళాకు సంబందించిన పోస్టర్ ను స్కిల్ డెవలప్మెంట్ అధికారి సంజీవ్ రావుతో కలిసి ఆమె బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో భాగంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా ఈనెల 22న ఉదయం 09.00 గంటల డి 5.00 గంటల వరకు బ్రాడీపేట 3వ లైన్ మాస్టర్ మైండ్స్ క్యాంపస్ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు సుమారు 24 కంపెనీలు రాబోతున్నాయని, 10వ తరగతి నుండి పీజీ చదువుకున్నయువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాకు నెక్స్ జెన్, అపెక్స్, టాటా, ఆదిత్య బిర్లా, మెడ్ ప్లస్, జాయ్ అలూకాస్, వరుణ్ గ్రూప్, మాస్టర్ మైండ్స్, క్లేవాంట్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలు రాబోతున్నా యన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గళ్ళా మాధవి, సంజీవరావు

జాతీయస్థాయి పోటీలకు టిజెపిఎస్ విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు : టిజెపిఎస్ కాలేజి ఇంటర్ విద్యార్థిని ఎస్‌కె.పర్వీన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.హెచ్ కామేశ్వరశాస్త్రి తెలిపారు. ఈనెల 12న నరసరావుపేటలో లేజర్ రన్ రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్ 17 విభాగంలో తతీయ స్థానంలో నిలిచిందని, 15వ తేదిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జిల్లా అథెలిటిక్స్ అసోసియేషన్(గుంటూరు) నిర్వహించిన జిల్లా అథెలిటిక్స్ మీట్లో 100 మీటర్ల పరుగుపందెంలో తతీయ స్థానం, 100 మీటర్ల హడిల్స్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. ఈనెలలో బీహార్‌లోని పాట్నలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలియచేశారు. బుధవారం పర్వీన్‌ను కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కెవి బ్రహ్మం అభినందించారు. చదువుతోపాటు క్రీడలలో రాణించే విద్యార్థులకు ఎల్లప్పుడూ కళాశాల ప్రోత్సహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల పిజి ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి, వ్యాయామ అధ్యాపకులు టి.వాసుదేవరరావు, కోచ్ ఆర్.శివాజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థిని పర్వీన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆటోలకు పెండింగ్ చలానాల అమలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటోలపై ఉన్న పెండింగ్ చలానాలపై బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ సిఐ ఆకుల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా 40 ఆటోల పై ఉన్న పెండింగ్ చలానాలను గుర్తించి వారి వద్ద నుండి అపరాధ రుసుము రూ.40 వేలు కట్టించడం జరిగినదని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజు ఈ విధముగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, ఆటో డ్రైవర్లు తమ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న పాత చలానాలను తక్షణమే ఆన్లైన్లో గాని లేదా పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి గాని క్లియర్ చేసుకో వాల్సిందిగా తెలియజేయడమైనది. ఈ స్పెషల్ డ్రైవ్ లో ఎస్సై రవీంద్రబాబు, ఆర్.ఎస్.ఐ పెద్దిరాజు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీరు తాగాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరానికి తాగునీరు అందించే ప్రకాశం బ్యారేజ్‌కి గోదావరి నీరు పట్టిసీమ నుండి వస్తున్నందున సదరు నీటిలో టర్బిటి శాతం (బురద) ఉంటున్నందున నగర ప్రజలు తాగునీటిని కొన్ని రోజులు కాచి చల్లార్చుకొని తాగాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరంలో తాగునీటి సరఫరా, నీటిలో టర్బిటి శాతం (బురద)పై ఢిల్లీ నుండి ఇంజినీరింగ్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. హెడ్ వాటర్ వర్క్స్ లో ముడి నీటిని మరింత శ్రద్ధగా ఫిల్టరేషన్ చేయడం, క్లోరిన్, ఆలం మిక్సింగ్‌లను తగిన మోతాదులో కలిపేలా ఎస్ఈ, ఈఈలు దృష్టి సారించాలని ఆదేశించారు. రిజర్వాయర్ల వారీగా ఏఈలు, టయిల్ ఎండ్ పాయింట్స్ వరకు ఎమినిటి కార్యదర్శులు తాగునీటి శ్యాంపిల్స్ సేకరించాలని స్పష్టం చేశారు.

నిడమర్రు రోడ్డులో 350 షాపులతో అధునాతన మార్కెట్

నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంత్రి లోకేష్ సమీక్ష

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలంగా వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న మరో 2వేలమంది ఆగస్టునెలలో శాశ్వత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... గతంలో 3వేలమందికి సుమారు రూ.వెయ్యికోట్ల విలువైన ఇళ్లపట్టాలు అందజేశామని, ఆగస్టులో మరో 2వేలు పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంటిఎంసి పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమీకృత అండర్ గ్రౌండ్ డ్రైనేజి, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో సిఎస్ఆర్, ప్రభుత్వ నిధులతో నిర్మించ తలపెట్టిన 31 కమ్యూనిటీ హాళ్లు, 26పార్కులు, శ్మశానాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేం దుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిడమర్రు మోడల్ హై స్కూల్ పునర్నిర్మాణ పనులను సెప్టెంబర్ లోగా పూర్తి

సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్

చేయాలని కోరారు. మంగళగిరిలో స్మార్ట్ స్ట్రీట్ బజార్, నిడమర్రు రోడ్డులో 350 షాపులతో అధునాతన కూరగాయలు, పూలు, పండ్ల మార్కెట్, పోలకంపాడు వద్ద రూ.2కోట్లతో చేపల మార్కెట్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి కూడా సందర్శకులు వస్తున్నందున మంగళగిరి ఎకో పార్కును ఎడ్వంచర్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో గుంతలు లేని రోడ్ల అభివద్ధి, ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టమ్, నూరుశాతం వీధిలైట్లుపై దృష్టిసారిం చాలని అధికారులకు సూచించారు. మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు, నియోజకవర్గ పరిధిలో చెరువుల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి లోకేష్ చర్చించారు. ఈ సమావేశంలో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హలీమ్ బాషా, ఎండోమెంట్స్ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎంటిఎంసి ఎస్ఇ శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ అశోక్, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే రాష్ట్రం సస్యశ్యామలం

ఎర్రబాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి -మంగళగిరి రూరల్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఆమె సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి యేడాది పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపట్ట బోయే పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమంతో పాటు అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ముఖ్యంగా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. ఆయా పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం కంటే ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. వైసీపీ విధ్వంస పాలనను తిరిగి గాడిలో పెట్టి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయ సత్య, రాష్ట్ర రైతు కమిటీ కార్యదర్శి గాదె పిచ్చి రెడ్డి, అమరావతి జేఏసీ నాయకులు మరియు టీడీపీ ముఖ్య నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు నీలం అంకారావు, మండల కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కర్నాటి సత్యనారాయణ, మండల కమిటీ కార్యదర్శి గడదాసు రంగారావు, ఫిరోజ్, తాతారావు, ఎలమంచిలి పద్మజ, లక్ష్మీ, పానయ్య, చింతా జగన్ మోహన్ రావు, పాలకాయల నాగేశ్వరావు, గోపి, ఆలా వెంకట నారాయణ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు అవగాహన సంస్థ మద్దతు

ప్రజాశక్తి - గుంటూరు

ప్రతి ఇంటికి, వ్యాపార సంస్థకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు అదానీ మనుషులు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమానికి అవగాహన సంస్థ మద్దతుగా నిలుస్తుందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే వాణిజ్య వ్యాపార సముదాయాల్లో బిగించిన లక్షలాది స్మార్ట్ మీటర్లు అధిక బిల్లులతో వ్యాపారస్తుల నడ్డి విరుస్తున్నాయని, స్మార్ట్ మీటర్లు ఏ ఇంటికి బిగించకుండా తిరస్కరించే విధంగా పౌర సమాజం ముందుకు రావాలని, అధికార పార్టీలు గత శతాబ్ద కాలంగా అదాని, షిరిడి సాయి లాంటి ప్రైవేట్ కంపెనీలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలపై పున: సమీక్ష జరగాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది. వినియోగదారులపై మోపిన ట్రూ అప్, ఎఫ్ పిపిసిఎ భారాలను రద్దు చేయాలని, ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న జెన్ కో నుండి విద్యుత్ తీసుకోకుండా ప్రైవేట్ నుండి ఎక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ ప్రజల నెత్తిన ఆ భారాలు మోపటాన్ని విద్యుత్ వినియోగదారులు నిరసించాలన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్లో వివిధ పార్టీలు పోరాటం జరపటంతో మమతా బెనర్జీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల వ్యవహారంలో వెనక్కి తగ్గిందని, మన చుట్టు పక్క రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణలలో స్మార్ట్ మీటర్లు బిగించడం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తీరుని నిరసిస్తూ మీటర్ల ఏర్పాటును అందరూ కలిసి అడ్డుకోవాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

అర్హత కలిగిన ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు టిడిపి జిల్లా కార్యదర్శి అత్తిమల్ల రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని బలుసుపాడు, పెదకూరపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో టిడిపి నాయకులు ఇంటింటికి కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి అత్తిమల రమేష్, మండల పార్టీ అధ్యక్షులు వై బ్రహ్మయ్య, బెల్లంకొండ రాంగోపాల్రావు, గల్లా బాబురావు, కంచర్ల సుధాకర్ పాల్గొన్నారు.

మూడోసారి ముంచిన వ్యాపారి

ప్రజాశక్తి దుగ్గిరాల

మండలంలోని ఈ మని గ్రామానికి చెందిన మొక్కజొన్న జొన్న వ్యాపారి లక్ష్మణ్ కుమార్ మూడోసారి మోసం చేసినట్లు రైతులు వాపోతున్నారు ఈ మేరకు బుధవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్లో అతనిపై ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన శ్రీలత కు ఎనిమిది లక్షలు, అర్జున్ రావుకు మూడు లక్షలు, అంబటి వెంకట శేషు కుమారికి 3 లక్షల 30 వేలు దుగ్గిరాల గ్రామానికి చెందిన దేశ బోయిన సాంబశివరావుకు లక్ష రూపాయలు చెల్లించవలసి ఉన్నది. దాదాపు 14 లక్షల వరకు వీరి లెక్క తేలినది ఇంకా అనేక మందికి ఇవ్వాల్సి ఉందని బాధితులు తెలిపారు. గతంలో కూడా ఇతనిపై స్టేషన్లో ఫిర్యాదులు ఉన్నాయి కొనుగోలు ప్రారంభంలో రైతులకు డబ్బులు చెల్లిస్తాడని చివరి ఆఖరులో పరారవు తాడని ఆ గ్రామస్తులు తెలిపారు. ఇతర వ్యాపారస్తులు కొన్ని ధరపై ఎక్కువ ధర పెట్టి కొంటాడని అందువలన రైతులు ఇతనికే పంట అమ్ముతుంటారని వారు తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం అతని ఆస్తులు గతంలోనే భార్య పేరు పెట్టాడని ఆరోపించారు. లక్ష్మణకుమార్, అతని వదిన మల్లీశ్వరి, సహాయకుడు రామ్మోహనరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్యాస్ డెలివరీ బాయ్ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి తెనాలి

గ్యాస్ డెలివరీ బాయ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం స్థానిక సుల్తానాబాద్ సుందరయ్యనగర్కు చెందిన దాసరి బాలస్వామి(20) ఓ ఏజెన్సీలో గ్యాస్ డెలివరీ బాయ్గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి స్నేహితులతో కలిసి జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహ సముదాయానికి వెళ్లాడు. బుధవారం ఉదయం చూడగా కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యులు అతని స్నేహితులపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు పడి ఉంటాడని తమకు ఏమీ తెలియదని స్నేహితులు చెబుతున్నట్లు సమాచారం. అనుమానాస్పద మృతి గా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ కార్డులో చేర్పులు, మార్పులపై అయోమయం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్కార్డులతో పాటు కొత్తగా సభ్యుల చేర్పులు, మార్పులు ప్రక్రియను గత నెలలో చేపట్టింది. దీనికి సంబంధించి అన్ని సచివాలయాలకు అప్పగించారు. ముందుగా రేషన్ కార్డులో చేర్పులలో తీవ్ర అయోమయం నెలకొంది. ఇద్దరు పిల్లలు ఉండి వారిని రేషన్ కార్డులో నమోదు చేయాలంటే ఒక్కరి పేరు మాత్రమే నమోదు అవుతోంది. రెండో పేరు నమోదుకావటం లేదు. ఎన్నిసార్లు సిబ్బంది ప్రయత్నం చేసినా ఫలితం లేదు. ఇలా ఎందుకు జరుగుతుంది. ఎక్కడ లోపం ఉంది? పదే పదే ఎక్కువసార్లు ఇలాంటి ఇబ్బందులు ఎదురౌతూ ఉంటే పరిష్కారం ఏమిటి అనే ప్రశ్నకు జవాబు లేదు. ఇది సాంకేతిక పరమైన లోపం అయితే ఎవరు సరి చేస్తారు. రేషన్ కార్డు ప్రక్రియ ప్రజల్ని తీవ్ర అయోమయానికి గురి చేస్తోంది. ఈ లోపు ఇచ్చిన సమయం కాస్త ముగిసి పోయింది ప్రస్తుతం కార్యక్రమాన్ని ఆపివేసామని చెప్పడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కోట మృతికి సంతాపం

ప్రజాశక్తి- తాడేపల్లి

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో విలక్షణ నటన కనబరిచిన కోట శ్రీనివాసరావు అకాల మరణం కళా రంగానికి తీరని లోటని సినీ, నాటకరంగ సీనియర్ కళాకారులు ఉండవల్లి పార్థసారథి, జొన్న రామలింగేశ్వరరావులు సంతాపం వ్యక్తపరిచారు. పాత్ర ఏదైనా తన నటనా కౌశల్యంతో ప్రేక్షకులను అలరించే అద్భుత నటులు కోట శ్రీనివాసరావు అని కొనియాడారు. రెండు దొండకాయలే వండాలనే పిసినారిగా నటించినా, కుప్పతొట్లో పండిన అంటూ యాసలు పలికించే విలన్ గా అలరించినా, కన్నీరు పెట్టించే విషాద పాత్రలో అయినా కోట నటనకు మరెవ్వరూ సాటి రారని కీర్తించారు. తెలుగు చలనచిత్ర సీమలో కోట శ్రీనివాసరావు ఓ అజరామరమైన నటుడని కొనియాడారు. తరాలు మారిన ధ్రువతారగా ప్రజల గుండెల్లో నిలిచిపోయే కోట శ్రీనివాసరావుకు అశ్రు నివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం

ప్రజాశక్తి మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు మధ్యవర్తిత్వం -దేశం కోసం, దేశవ్యాప్తంగా 90 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళగిరి కోర్టు ప్రాంగణం నందు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన ప్రచార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు లంకాశివరాం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ బాబు, ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్న లక్ష్మి మాట్లాడారు. ఈ సందర్భంగా లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం ఆఫ్ మీడియేషన్ వన్ కె వాక్ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో మీడియేషన్ న్యాయవాదులు కె.బి.అంబేద్కర్, రజని, పలువురు న్యాయవాదుల, కోర్టు స్టాఫ్, కక్షిదారులు పాల్గొన్నారు.

కల్లుగీత ప్రాంతాలలో తనిఖీలు

ప్రజాశక్తి-ఈపూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఈపూరు సర్కిల్ పరిధిలోని బొల్లాపల్లి, ఈపూరు, రొంపిచర్ల మండలాల లోని కల్లు గీసే ప్రాంతాలలో, కల్లు అమ్మకం జరిపే ప్రదేశాలలో సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. కల్లుగీత దారులకు కల్లు కల్తీ చేయ కుండా కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. కల్లు సేవించేవారు ఎలాంటి సందేహం అనుమానం ఉన్న స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని ఆయన కోరారు.

17న దేవాలయ భూముల వేలం

ప్రజాశక్తి -రెంటచింతల

మండలంలోని రెంటాల గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి మిట్ట గుడిపాడులోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన మెట్ట, మాగాణి భూములకు ఈనెల 17న వేలంపాటలు నిర్వహిస్తామని ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి శివాలయంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.